విశాఖపట్టణం
గురువారం 3 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 202 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## అక్కడే తేల్చుకోండి..!

విశాఖ ఎయిర్ పోర్టుపై ఢిల్లీ హైకోర్టులో పిటీషన్

హైకోర్టును ఆశ్రయించవచ్చని సలహా





2

# ఉత్తరాంధ్రలో గోదారి పరవళ్లు..!

**చారిత్రాత్మక ఘటన సాక్షాత్కారం**

**పీఎల్ పురం వద్ద నీటి విడుదల చేసిన సీఎం**

**గోదారి జలాలకు చంద్రబాబు సాష్టాంగ నమస్కారం**







(అనకాపల్లి - జయజయహే)

ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఆశగా ఎదురుచూస్తున్న చారిత్రాత్మక ఘట్టం సాకారమైంది. గోదావరి జలాలు పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్ర నేలను స్పృశించాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని క్రాస్ రెగ్యులేటర్ మీట నొక్కి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ఎడమ కాలువ నిర్మాణం, నీటి ప్రవాహ తీరును పరిశీలించారు. అనంతరం పాయకరావుపేట చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానిక కళాకారులు సంప్రదాయ కోలాట నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. గోదావరి జలాల రాకకు సూచికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఓపెన్ టాప్ జీపులో ప్రయాణిస్తూ ప్రవాహ ప్రాంతానికి చేరుకున్న ఆయన, కాలువ వద్ద గోదావరి మాతకు పవిత్ర జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనితలతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి తాగు, సాగునీటి ఎద్దడి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పోలవరం ఎడమ కాలువ పనులను ..మిగతా 2లో



ఏయూలో క్వాంటం టెక్నాలజీ,

## ఏఐ సిస్టమ్స్

**సెమికండక్టర్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్**

**కసరత్తు చేస్తున్న వర్శిటీ యాజమాన్యం**

(విశాఖపట్నం - జయజయహే)

ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) పరిశోధన, ఆధునిక సాంకేతిక వైపు వేగంగా అడుగులు వేస్తోంది. రాబోయే రెండు మూడేళ్లలో క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిస్టమ్స్, అలాగే సెమీకండక్టర్ల విభాగాల్లో అత్యాధునిక సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రకటించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల క్లస్టర్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన 'క్వాంటమ్-ఎన్‌హాన్స్డ్ సస్టైనబుల్ టెక్నాలజీస్ ఫర్ ఏఐ సిస్టమ్స్' అనే మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. శతాబ్ది ఉత్సవాల వేడుకలు విజయవంతంగా ముగిసిన అనంతరం, విశ్వవిద్యాలయంలో ..మిగతా 2లో

# వైఎస్సార్ వర్ధంతి రోజే పోలవరం ఎడమ కాలువలోకి నీళ్ళు

**ఇదీ దేవుడి స్క్రిప్ట్ అంటే, దీనికి చంద్రబాబే ప్రత్యక్ష సాక్షి**

**పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు నీళ్లు తెస్తున్నట్లు కొత్త డ్రామా**

**పురుషోత్తపట్నం నుంచి నీళ్లు తెచ్చి పోలవరం అని బిల్డప్**

**ఉత్తరాంధ్రను మరోసారి మోసం చేసిన చంద్రబాబు**

**గుడివాడ అమర్నాథ్ ఆక్షేపణ**



(విశాఖపట్నం - జయజయహే)

పురుషోత్తపట్నం లిఫ్ట్ నుంచి పోలవరం ఎడమ కాలువలోకి నీళ్ల ఎత్తి పోసి, ఉత్తరాంధ్రకు పోలవరం జలాల్ని తీసుకొచ్చానంటూ గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకే చెల్లిందని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. అనకాపల్లి జిల్లాలో చంద్రబాబు టూర్ ఓ డ్రామాలా సాగిందని, ఉత్తరాంధ్ర ప్రజల్ని మరోసారి మోసం చేసిన చంద్రబాబు.. వారికి సాష్టాంగ నమస్కారం చేయడం తప్పులేదన్నారు. ఉత్తరాంధ్రలో ఎన్నో పోర్టులు, ప్రాజెక్టులు, కాలేజీలు తీసుకొచ్చి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధికి చిరునామాగా నిలిచారని, కానీ చంద్రబాబు మాత్రం ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాకుండా ద్రోహిగా మిలిగిపోతున్నారని గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాలో ..మిగతా 3లో

# జై కొట్టు..!

**జనసేన యువజన విభాగానికి నామకరణం**

**పిఠాపురంలో లోగో ఆవిష్కరించిన నాదెండ్ల**

**పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆడియో సందేశం**



(పిఠాపురం - జయజయహే)

జనసేన పార్టీ తమ అధికారిక యువజన విభాగాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఈ యువజన విభాగానికి 'జై కొట్టు అనే శక్తివంతమైన పేరును ఖరారు చేస్తూ, దానికి సంబంధించిన లోగోను పిఠాపురంలో ఘనంగా ఆవిష్కరించారు. పార్టీ నాదెండ్ల మనోహర్ ఈ లోగోను విడుదల చేయగా, పెద్ద ఎత్తున జనసైనికులు, యువత హాజరయ్యారు. రాష్ట్ర నిర్మాణంలో యువత భాగస్వామ్యం ఎంతైనా ..మిగతా 2లో



జీవో 69ని తక్షణమే

## రద్దు చేయాలి

**అర్ధరాత్రి అరెస్టులతో ఆదివాసీ బిడ్డల గొంతు నొక్కలేరు**

**గురుకులాన్ని అక్కడే కొనసాగించాలి**

**ఎమ్మెల్సీ కుంభా రవిబాబు డిమాండ్**

(విశాఖపట్నం, జయజయహే)

విశాఖపట్నం మారికవలసలో ఉన్న ప్రతిష్టాత్మక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను అర్ధాంతరంగా తరలించడాన్ని నిరసిస్తూ, పేద గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ వైఖరిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన నేతలు తీవ్రంగా ఎండగట్టారు. గురుకుల పాఠశాలను యథావిధిగా అక్కడే కొనసాగించాలని, పాఠశాల తరలింపు ..మిగతా 2లో

# బెయిల్ పిటీషన్ల కొట్టివేత

**సాయికృష్ణ డెత్ మిస్టరీ కేసు**



(విజయవాడ - జయజయహే)

గాదె సాయి కృష్ణ లాకప్ డెత్ కేసులో అరెస్టయిన నలుగురు పోలీసు అధికారుల బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏ1 సీఐ నాగరాజు, ఏ3 హెడ్ కానిస్టేబుల్ జంగం నాని, ఏ5 హెడ్ కానిస్టేబుల్ బాబురావు, ఏ6 సాంబయ్య దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసింది. సాయి కృష్ణ లాకప్ డెత్‌కు సంబంధించిన కేసులో పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఏ1 సీఐ నాగరాజు రాజమండ్రి ..మిగతా 2లో



టీటీడీ డిప్యూటీ ఈఓపై

## ఏసీబీ సోదాలు

**భారీగా ఆదాయానికి మించిన ఆస్తులు**

(తిరుమల - జయజయహే)

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఈవో మెండు లోకనాథం నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆయనపై వచ్చిన ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ..మిగతా 2లో

# ఉల్లి ఘాటు..!

**భారీగా పెరిగిన ధర.. కిలో రూ. 48కి చేరిక**

**ఇప్పటికే టమాటో, పంచదార భగభగ**

(విజయవాడ - జయజయహే)

సామాన్యులకు బ్యాడ్‌న్యూస్. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. కూరగాయలతో పాటు సరుకుల ధరలు పెరుగుతుండటంతో సామాన్యులపై మరింత భారం పడుతోంది. రోజువారీ కూలీ చేసుకుని జీవితం కొనసాగించేవారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల టమాట ధరలు పెరగ్గా.. ఇప్పుడు ఉల్లిపాయల ధరలు గత కొద్దిరోజులుగా ..మిగతా 2లో



# జీవో 69ని తక్షణమే రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి...




కోసం జారీ చేసిన వివాదాస్పద జీవో నంబర్ 69, దాని అనుబంధ మెమోను తక్షణమే రద్దు చేయాలని పార్టీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ మంత్రి పి. బాలరాజు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్మన్ శోభ స్వాతిరాణి డిమాండ్ చేశారు. హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్సీపీ నేతలపై అక్రమ నిర్బంధాలు, లాఠీఛార్జీలు, అర్ధరాత్రి అరెస్టులతో అణచివేతకు పాల్పడటం కూటమి ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలకు నిదర్శనమని వారు మండిపడ్డారు. జీవో 69 రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

**మాటల గారడీలు వద్దు - మాజీ మంత్రి బాలరాజు**

పాఠశాల ఎత్తివేత కోసం జారీ చేసిన ఉత్తర్వులను, మెమోను తక్షణమే ఉపసంహరించుకుని ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకోవాలి. మా బిడ్డలు ఇక్కడే చదువుకుంటారని నిరసన తెలుపుతున్న తల్లిదండ్రుల పట్ల, వారికి అండగా నిలిచిన మా పట్ల ప్రభుత్వం కరుడుగట్టిన నేరస్తుల మాదిరిగా అమానుషంగా వ్యవహరించింది. ధర్నా చేస్తున్న ప్రాంతంలో కనీసం కూర్చోవడానికి తెచ్చుకున్న పట్టలు, తినడానికి తెచ్చుకున్న ఆహారాన్ని కూడా పోలీసులు లాక్కెళ్లి స్టేషన్లలో పెట్టడం దారుణం. ముఖ్యమంత్రి పర్యటన ఉందని చెప్పి అర్ధరాత్రి వేళ దొంగతనంగా బస్సుల్లో పిల్లలను తరలించాల్సిన అవసరం ప్రభుత్వానికి, అధికారులకు ఎందుకు వచ్చింది? సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు మేం వ్యతిరేకం కాదు; దాన్ని ఖాళీగా ఉన్న వైటీసీ భవనాల్లో గాని, ఇతర నూతన ప్రాంగణాల్లో గాని అవసరమైన వసతులు కల్పించి నిర్వహించండి. నాడు దివంగత నేత వైఎస్సార్ 17 ఎకరాల్లో ఈ గురుకులాన్ని ప్రారంభిస్తే, మా నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి గారు గిరిజన ప్రాంతాలకు మెడికల్ కాలేజీలు తెచ్చి పేదల ఉన్నత చదువులకు బాటలు వేశారు. 422 మంది తల్లిదండ్రులు నేరుగా సంతకాలు పెట్టి ఇచ్చిన తీర్మానం కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు కనిపించడం లేదా? మళ్లీ రాతపూర్వక లేఖలంటూ ఎవరిని మభ్యపెడుతున్నారు? ఇప్పటికే పాఠశాల ప్రిన్సిపాల్‌ను, 35 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు; అక్కడ పిల్లలకు తిండి లేదు, క్లాసులు జరగడం లేదు, ఇలాంటి పరిస్థితుల్లో చదువులు ఎలా సాగుతాయి? నోటి మాటలతో మోసపూరిత హామీలు ఇవ్వడం కాదు, జీవో 69ని రద్దు చేసి పాఠశాల యథాతథంగా కొనసాగుతుందని అధికారిక రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలి. ప్రభుత్వ వేధింపులు తాళలేక కొందరు విద్యార్థులు పారిపోతామని తల్లిదండ్రులకు చెబుతున్నారు; ఆ పిల్లలకు ఏ చిన్న ప్రమాదం జరిగినా ఈ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి అని బాలరాజు డిమాండ్ చేసారు.

**విద్యార్థులను గెంటేయడం దుర్మార్గం - మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి**

విద్యా సంవత్సరం మధ్యలో 480 మంది గిరిజన విద్యార్థులను ఉన్నఫళంగా రోడ్డున పడేసి వేరే స్కూళ్లకు బదిలీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మెరిట్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ ఇవ్వడానికి మాకేమీ అభ్యంతరం లేదు, కానీ ఉన్న అద్భుతమైన మారికవలస గురుకులాన్ని బలవంతంగా ఖాళీ చేయించడం గిరిజనులకు ద్రోహం చేయడమే. 480 మందికి మాత్రమే వసతి, క్లాస్‌రూమ్‌లు, టాయిలెట్లు ఉన్న మారికవలస క్యాంపస్‌లో అదనంగా మరో 600 మందిని తెచ్చి మొత్తం 1000 మందిని ఎలా సర్దుబాటు చేస్తారు? శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను, మహిళా ప్రజాప్రతినిధులను అన్యాయంగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రి గారి పర్యటన సజావుగా సాగడం కోసం, ఏ నిరసనలు లేకుండా తప్పించుకోవడానికే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే కలిసి ఈ తాత్కాలిక డ్రామాలకు తెరతీశారు. తరలించిన విద్యార్థులందరినీ వెనక్కి తెచ్చేవరకు మరియు క్యాంపస్‌లో వారి వసతి సౌకర్యాలను పరిశీలించే వరకు మా పోరాటం ఆగదు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్థాయి వ్యక్తి తల్లిదండ్రులకు ఒక మాట చెప్పి, అర్ధరాత్రి పూట మోసపూరితంగా వ్యవహరించడం శోచనీయం. చంద్రబాబు నాయుడు గారి ఆలోచనలు ఎప్పుడూ పేదల పక్షాన ఉండవు; ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బతీసి కార్పొరేట్లను పెంచి పోషించడమే ఆయన నైజం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రస్తుతానికి అద్దె భవనాల్లో నడపాలి; ఈ ఏడాది సమయం తీసుకుని కొత్త క్యాంపస్ నిర్మించి అక్కడ ప్రారంభించాలి. గిరిజన బిడ్డల భవిష్యత్తుకు రవ్వంత ఇబ్బంది కలిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు, ఆదివాసీ సమాజం తరపున గట్టిగా పోరాడుతుంది అని భాగ్యలక్ష్మీ హెచ్చరించారు.

**కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు- జీసీసీ మాజీ చైర్మన్ శోభ స్వాతిరాణి**

11 ఏజెన్సీ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులను ఎక్కడికి తరలించారో, వారు తిండి తిన్నారో లేదో తెలియక గత పది రోజులుగా తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పాడేరులో ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటీకరించాలని చూడటం, ఇప్పుడు మారికవలస స్కూల్‌ను మూసేయడం గిరిజనులపై చంద్రబాబు సర్కారు చేస్తున్న కక్ష సాధింపు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ ప్రశ్నించినందుకు ఉదయం 5 గంటల నుంచే మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను అక్రమంగా హౌస్ అరెస్టులు చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, గిరిజన మహిళా నేత పుష్పశ్రీవాణి గారి పట్ల పోలీసులు అత్యంత అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాం. రాష్ట్రంలో హోం మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మహిళలై ఉండి కూడా మహిళా ప్రజాప్రతినిధులపై ఇంతటి పోలీసు దౌర్జన్యాలు జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటారా? నెల రోజులుగా మారికవలస పాఠశాల వివాదంపై ఇంత రాద్ధాంతం జరుగుతున్నా గిరిజన సంక్షేమ మంత్రి గానీ, విద్యాశాఖ మంత్రి గానీ స్పందించకపోవడం దారుణం. తమ పిల్లలు ఏ స్కూల్‌లో ఉన్నారో తెలుసుకునేందుకు వచ్చిన తల్లిదండ్రులకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు దాటవేయడం క్షమించరాని నేరం. శాంతియుతంగా గేటు ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి, గిరిజన సంఘాల నేతలను లాఠీలతో అణచివేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రభుత్వం మొండిపట్టు వీడి జీవో 69ని రద్దు చేయాలి; సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రత్యామ్నాయ భవనాల్లోకి మార్చి మారికవలస గురుకులాన్ని యథాతథంగా నడపాలి అని డిమాండ్ చేసారు.




# అక్కడే తేల్చుకోండి..!

## విశాఖ ఎయిర్ పోర్టుపై ఢిల్లీ హైకోర్టులో పిటీషన్

### హైకోర్టును అశ్రయించవచ్చని సలహా

**(న్యూఢిల్లీ - జయజయహే)**

విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పాత ఎయిర్‌పోర్టులో వాణిజ్య విమానాల నిలిపివేతపై దాఖలైన పిల్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సమస్య ఉత్పన్నమైంది విశాఖపట్నంలోనే అని.. స్థానిక హైకోర్టులోనే సవాల్ చేయాలని న్యాయస్థానం సూచించింది. ఫోరమ్ కన్వీనియన్స్ ప్రాతిపదికన ఈ పిటిషన్ కొట్టివేసింది. ప్రధాన కార్యాచరణ అంతా ఏపీలోనే ఉందని చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియా ధర్మాసనం స్పష్టం చేసింది. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పిటిషనర్ వాదనలు వినిపించారు. కొత్త ఎయిర్‌పోర్ట్ విశాఖ నగరానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉందని, కనెక్టివిటీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హైకోర్టు దృష్టికి పిటిషనర్ తీసుకువచ్చారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని న్యాయస్థానానికి పిటిషనర్ వివరించారు. అయితే బాధితులంతా విశాఖపట్నంలోనే ఉన్నందున సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతినిచ్చింది.

# వీఎంఆర్‌డీఏ ఖాళీ దుకాణాలు కేటాయింపునకు దరఖాస్తులు

## టెండర్, బహిరంగ వేలం ద్వారా కేటాయించేందుకు సన్నాహాలు

**విశాఖపట్నం (జయ జయహే)**

మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ) చే నిర్మించిన వాణిజ్య సముదాయములు, షాపులు, ఆడిటోరియంలు, ఆఫీసులు మరియు ఖాళీ స్థలములు నెలవారి / సంవత్సరము అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇవ్వటానికి నిర్ణయించటం జరిగింది. ఆయా దుకాణాలు, ఆడిటోరియంలు, కార్యాలయాలు, ఖాళీ స్థలాలను "టెండర్ మరియు బహిరంగ వేలం పాట ద్వారా నిర్ణయించిన ధరకు అద్దెకు ఇవ్వటం జరుగుతోంది. వాటి పూర్తి వివరములైన విస్తీర్ణము, అద్దె, నిర్ణయించిన ధర తదితర వివరాలు వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ ఞఞఞ.జఎతీఝ.స్త్రశీఙ.ఱఅ నందు పొందుపరచటం జరిగింది. ఈ షాపులు, వాణిజ్య సముదాయములు యదాతథంగా 3 ఏళ్ల కాల పరిమితి కొరకు నెలవారి/సంవత్సరము అద్దె ప్రాతిపదికపై బహిరంగ వేలం వేయటం జరుగుతోంది. ఆశక్తిగల వారు, దరఖాస్తులను వీఎంఆర్‌డీఏ వెబ్ సైట్ నందు గాని. వీఎంఆర్‌డీఏ కార్యాలయము (8వ అంతస్తు) రెవిన్యూ విభాగం నుంచి గానీ పొందవచ్చును. అదేవిధంగా ధరఖాస్తుతో పాటుగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఉడా బ్రాంచ్) సిరిపురంలో ధరఖాస్తు రుసుము ఒక్కంటికి రూ. 2,000 చలానా రూపములోచెల్లించి, ధరావత్తు సొమ్ము ఒక్కంటికి రూ. 1,00,000 "ది మెట్రోపాలిటన్ కమీషనర్, వీఎంఆర్‌డీఏ, విశాఖపట్నం" వారి పేరున డి.డి. తీసుకొని, పూరించిన ధరఖాస్తు, చలానా, డి.డి. లు మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కార్యాలయంలో (8వ అంతస్తు) నందు 02-09- 2026 నుండి 15-09-2026 సాయంత్రము 5:00 గంటలలోపు అందజేయవలెను. ఎస్సీ/ ఎస్టీ/ పిహెచ్ క్యాటగిరి వారు అయినట్లయితే వారి కులము మరియు సంబంధిత ధృవపత్రమును తప్పనిసరిగా జతపరచవలెను. బహిరంగ వేలము 17-09-2026 ఉదయం 11 గంటలకు సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్ ఆవరణలో నిర్వహించటం జరుగుతోందని వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.


# ఉల్లి ఘాటు..!

మొదటి పేజీ తరువాయి...



మండిపోతున్నాయి. ఒకవైపు చక్కెర ధరలు పెరుగుతున్న క్రమంలో ఇప్పుడు ఉల్లి కూడా తోడైంది. గత కొద్ది రోజుల్లో ఉల్లి ధరలు గణనీయంగా పెరిగి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. వంటిట్లో అవసరమైన అత్యంత నిత్యావసర వస్తువుల్లో ఉల్లిపాయలు ఒకటి. రోజూ వంటల్లో దీనిని ఉపయోగిస్తూ ఉంటారు. ఇది లేనిది ఏ కూర కూడా వండటానికి కుదరదు. కొద్ది రోజుల క్రితం కిలో రూ.20కే లభించగా.. ఇప్పుడు రెట్టింపయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం కిలో ఉల్లి ధర రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. హైదరాబాద్‌లోని మెహిదీపట్నం రైతు బజార్‌లో చూస్తే సెప్టెంబర్ 2వ తేదీన కిలో ఉల్లిపాయలు రూ.40గా ఉండగా.. టమాట రూ.19, వంకాయ రూ.35, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.37, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.15, బీన్స్ రూ.65, క్యారెట్ రూ.37, దొండకాయ రూ.23, చిక్కుడు కాయ రూ.35, బీట్ రూట్ రూ.32, ఆలుగడ్డ రూ.16, కీర రూ.18, దోస రూ.15, సొరకాయ రూ.9, పొట్లకాయ రూ.13, చామ రూ.25 వద్ద కొనసాగుతున్నాయి. ఇక విజయవాడలోని రైతు బజార్లలో చూస్తే కిలో ఉల్లి రూ.48 పలుకుతోంది. టమాట రూ.30, వంగ రూ.24, బెండ రూ.16, పచ్చిమిర్చి రూ.32, కాకర రూ.28, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండకాయ రూ.28, బంగాళదుంప రూ.28, గోరుచిక్కుడు రూ.24, దోస రూ.16, చిక్కుళ్లు రూ.40, బీరకాయ రూ.24, చామదుంప రూ.34, కంద రూ.34, బీట్ రూట్ రూ.40, కీరదోస రూ.50, బీన్స్ రూ.94, క్యాప్సికం రూ.50, అలసందలు రూ.30, చిలకడదుంప రూ.46కు లభిస్తున్నాయి. భారత్‌లో సగటు కిలో ఉల్లి ధర రూ.49.59కి చేరుకుంది. 2025 సెప్టెంబర్ 2వ తేదీన కిలో ఉల్లి రూ.28.48గా ఉండగా.. ఇప్పుడు 74 శాతానికిపైగా పెరిగింది. అయితే ఉత్పత్తి వల్ల ఈ కొరత రాలేదని, రబీ కోత సమయంలో కురిసిన అకాల వర్షాలు పంటను దెబ్బతీశాయని చెబుతున్నారు. నిల్వ నష్టాల వల్ల మండీలకు చేరే నాణ్యమైన ఉల్లిపాయల పరిమాణం మరింత తగ్గిందని, దాని వల్లనే ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. భారత్‌లో ఈ ఏడాది సుమారు సుమారు 307.37 లక్షల టన్నుల ఉల్లిపాయలు అయ్యాయి. అయితే ప్రస్తుత ధరల పెరుగుదలకు ఉత్పత్తి తగ్గడం కంటే. వాతావరణం వల్ల కలిగే నష్టంప్రధాన కారణంగా ఉంది.





## టీటీడీ డిప్యూటీ ఈఓపై

# ఏసీబీ సోదాలు

మొదటి పేజీ తరువాయి...

బుధవారం ఉదయం నుంచి ఏసీబీ రంగంలోకి దిగి చర్యలు చేపట్టింది. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో 7 ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన అధికారులు ఉదయం 6 గంటల నుంచే తిరుపతి పెదకాపు లేఅవుట్‌లోని లోకనాథం ఇంటితో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సమయంలో లోకనాథం తన నివాసంలోనే ఉన్నారు. కేవలం ఆయన నివాసానికే పరిమితం కాకుండా తిరుమలలోని లోకనాథం వసతిగృహం, తిరుపతిలో ఉన్న ఆయన ఇద్దరు బావమరుదుల ఇళ్లు, ఏర్పేడు మండలం చెల్లూరులోని సోదరుడి ఇంటితో పాటు ఇతర బంధువుల నివాసంలో సోదాలు చేపట్టారు. తిరుపతి ఎస్టీవీ నగర్‌లోని ఎస్బీఐ బ్రాంచ్ లాకర్లను కూడా ఏసీబీ బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. గతంలో 2011లో నాటి టీటీడీ డిప్యూటీ ఈవో భూపతిరెడ్డి ఇంట్లో ఏసీబీ దాడులు నిర్వహించారని తెలిసిందే. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఒక ఉన్నతాధికారి నివాసంలో ఏసీబీ సోదాలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏయూలో క్వాంటం టెక్నాలజీ,

# ఏఐ సిస్టమ్స్

మొదటి పేజీ తరువాయి...

నాణ్యమైన అభివృద్ధి కార్యకలాపాలపై పూర్తి దృష్టి సారించామని వైస్-ఛాన్సలర్ తెలిపారు. ఈ సదస్సులో జరిగే చర్చలు, సూచనలు రాబోయే 2-3 ఏళ్లలో విశ్వవిద్యాలయంలో ప్రతిపాదిత మూడు ల్యాబొరేటరీలను నిర్మించడానికి ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా, సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు చూపే విధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభ ఉపన్యాసం చేసిన ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. క్వాంటమ్ రంగానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.6,000 కోట్ల భారీ బడ్జెట్‌తో 'నేషనల్ క్వాంటమ్ మిషన్'ను ప్రారంభించిందని తెలిపారు. భవిష్యత్తు సాంకేతిక పరిణామాలపై ఆయన మాట్లాడుతూ, క్వాంటమ్ కంప్యూటింగ్ అనేది ప్రస్తుతం ఉన్న సాంప్రదాయ కంప్యూటింగ్‌ను పూర్తిగా భర్తీ చేయదన్నారు. రాబోయే రోజుల్లో ఇవి రెండూ కలిపి పనిచేసే హైబ్రిడ్ మోడల్ అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేవలం క్వాంటమ్ వ్యాలీ మాత్రమే కాకుండా, ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు మరియు ఐబీఎమ్, టీసీఎస్ వంటి ప్రముఖ గ్లోబల్ భాగస్వాములను ఒకే చోటకు చేర్చి ఒక ఇంటిగ్రేటెడ్ క్వాంటమ్-ఏఐ వ్యవస్థను నిర్మించే అద్భుత అవకాశం ఉందని సత్యనారాయణ తెలిపారు. విశాఖపట్నం నగరం వేగంగా డేటా సెంటర్ల కేంద్రంగా మారుతోందని, ఏఐ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి ఈ డేటా సెంటర్లు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇలాంటి భారీ డేటా సెంటర్లకు అధిక మొత్తంలో విద్యుత్, నీరు అవసరమవుతాయని, అందుకే ఈ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు'సుస్థిరత అనేది అత్యంత ముఖ్యమైన అంశంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.

# జై కొట్టు..!

మొదటి పేజీ తరువాయి...

ఉందని, వారి భావాలను, సమస్యలను వేదికపైకి తీసుకురావడానికే ఈ వేదికను సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా 'జై కొట్టు' లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మార్పు తీసుకురావడానికి యువశక్తి ఎంతో కీలకమని పేర్కొన్నారు. జనసేన సిద్ధాంతాలను ప్రజా క్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లడంలో 'జై కొట్టు' విభాగం చురుగ్గా వ్యవహరిస్తుందని, యువతలోని నాయకత్వ పటిమను బయటకు తీయడమే దీని ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపిన ప్రత్యేక ఆడియో మెసేజ్ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ తన సందేశంలో యువతకు దిశా నిర్దేశం చేస్తూ, బాధ్యతాయుతమైన రాజకీయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. 'జై కొట్టు' అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని, అది యువత ఆశయాలకు, ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. పవన్ ఆడియో సందేశంతో జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నిండింది.

# ఉత్తరాంధ్రలో గోదారి పరవళ్లు..!

మొదటి పేజీ తరువాయి...



పూర్తి చేసింది. ఎడమ కాలువ నిర్మాణానికి ప్రభుత్వం రూ.4,192 కోట్లను ఖర్చు చేసింది. ఈ కాలువ ద్వారా నాలుగు జిల్లాల పరిధిలోని దాదాపు 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. సుమారు 9 లక్షల మంది ప్రజల దాహార్తిని తీర్చేలా ప్రణాళిక రూపొందించారు. అనకాపల్లి వద్ద ఉన్న ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను ఈ జలాలతో సమర్థవంతంగా నింపనున్నారు. గోదావరి వరద జలాల వినియోగంతో ఉత్తరాంధ్రలోని అనేక ఆయకట్టు ప్రాంతాలకు శాశ్వత నీటి భద్రత లభించనుంది. పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80,000 ఎకరాలు, పంపా ప్రాజెక్టు పరిధిలో 12,000 ఎకరాలు, తాండవ, వరహా, మామిడిగడ్డ వీటన్నింటి పరిధిలోని 46,620 ఎకరాల ఆయకట్టుకు నీరు లభిస్తుంది. టితో పాటు మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలను మళ్లించడం ద్వారా విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని ప్రముఖ పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరాతో పాటు తాగునీటి కొరతను అధిగమించేందుకు జలవనరుల శాఖ సమగ్ర ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కొత్త ఉత్తేజాన్ని పుంజుకోనున్నాయి.

# బెయిల్ పిటీషన్ల కొట్టివేత

మొదటి పేజీ తరువాయి...

సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఏ3 జంగం నాని ఏలూరు సబ్ జైలులో, ఏ5 బాబురావు అవనిగడ్డ సబ్ జైలులో,ఞా6 సాంబయ్య గన్నవరం సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. తమకు బెయిల్ మంజూరు చేయాలని నలుగురు నిందితులు కోర్టును ఆశ్రయించగా.. విచారణ అనంతరం వారి పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. దీంతో నలుగురూ ప్రస్తుతం జైల్లోనే కొనసాగనున్నారు. సాయి కృష్ణ లాకప్ డెత్ కేసులో తదుపరి విచారణపై ఉత్కంఠ నెలకొంది.

# వైఎస్సార్ వర్ధంతి రోజే పోలవరం ఎడమ కాలువలోకి నీళ్ళు

**మొదటి పేజీ తరువాయి...**

సీఎం చంద్రబాబు పర్యటన మరో ఈవెంట్ లా సాగిపోయింది. ఈ మధ్య కాలంలో ఆయన ఎక్కడికి వెళ్లినా కొత్త కొత్త స్కిట్లు చేస్తున్నారు. ఇది కూడా ఓ అలాంటి స్కిట్ లాగా సాగింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు ఉత్తరాంధ్రకు తెస్తున్నట్లు కొత్త డ్రామాకు తెరలేపారు. వాస్తవానికి పోలవరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు రావాలని, ఈ ప్రాంతంలోని లక్షల ఎకరాలకు నీళ్లు అందాలని, ఈ ప్రాంతంలో ఉన్న రైతాంగం బాగుండాలని అందరూ ఆశిస్తున్నారు. నిజంగానే పోలవరం నుంచి నీళ్లు వచ్చి ఉంటే అందరూ సంతోషించే వాళ్లం. కానీ పురుషోత్తపట్నం నుంచి లిఫ్ట్ ద్వారా గోదావరిలో నీళ్లను పోలవరం ఎడమ కాలువలో వదిలి, దాన్ని పోలవరం నుంచే నీళ్లు వస్తున్నట్లు చంద్రబాబు కొత్త డ్రామా చేశారు. తద్వారా మరోసారి ఉత్తరాంధ్ర ప్రజానీకాన్ని మోసం చేసే కార్యక్రమం చేశారు. పోలవరం ప్రాజెక్టుపై నాలుగు దశాబ్దాలుగా చర్చ జరుగుతోంది. 1982-83లో అంజయ్య గారు దీనికి పునాదులు వేసారు. ఆ తర్వాత వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు దాదాపు తొమ్మిదేళ్ల పాటు ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అప్పటికే పోలవరం ప్రాజెక్టు జీవనాడి అని రాష్ట్రంలో చర్చ జరిగేది, జాతీయ ప్రాజెక్టుగా దీన్ని చూసేవారు. కానీ చంద్రబాబుకు రైతులన్నా, వ్యవసాయం అన్నా ఎప్పుడూ చిన్నచూపే. 2004లో రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యాక పోలవరం ప్రాజెక్టుకు అనుమతులు తీసుకొచ్చి, కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం దాదాపు ఆరు వేల ఎకరాలకు పైగా భూసేకరణ కూడా చేశారు. తద్వారా ఎడమ ప్రధాన కాలువలో దాదాపు 80 శాతం నిర్మాణం పూర్తి చేశారు. కానీ ఇప్పుడు పురుషోత్తపట్నం దగ్గర లిఫ్ట్ నుంచి నీళ్లు ఎత్తిపోసి ఉత్తరాంధ్రకు పోలవరం నీళ్లు ఇచ్చానని చెప్పుకోవడం రాజకీయాల్లో సీనియర్ ముఖ్యమంత్రి అని చెప్పుకునే మీకు సిగ్గుచేటుగా అనిపించడం లేదా ? అని అమర్ నాథ్ నిలదీసారు.

**పోలవరాన్ని ఏటీఎంలా మార్చుకున్న చంద్రబాబు**

చంద్రబాబుకు ఏరోజూ పోలవరం ప్రాజెక్టు గురించి కానీ, అక్కడి రైతుల గురించి కానీ, దాదాపు 38 లక్షల ఎకరాల



ఆయకట్టు సస్యశ్యామలం అవుతుందని కానీ ఆలోచన లేదు. పోలవరం చంద్రబాబుకు ఏటీఎం అని ఈ దేశ ప్రధాని రాష్ట్రానికి వచ్చి చెప్పిన విషయం మర్చిపోయారా ? పోలవరం ఎడమ ప్రధాన కాలువలో ఐదారు శాతం మిగిలి పోయిన పనుల్ని భారీగా అంచనాలు పెంచేసి సొంత మనుషులకు పనులు అప్పగించిన విషయం చంద్రబాబు మర్చిపోయారా ? ఇది మీకు ఓ అవినీతి ప్రాజెక్టు అని రాష్ట్ర ప్రజల నుంచి దేశ ప్రధాని వరకూ తెలుసు. 2024 ఆగస్టులో మీరు ప్రభుత్వంలోకి వచ్చాక జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో 45.72 మీటర్ల ఎత్తులో ఉండాల్సిన పోలవరం ప్రాజెక్టును 41 మీటర్లు ఉంటే చాలని ఒప్పుకుని వచ్చిన విషయం మర్చిపోయారా ? ఈ ప్రాంతానికి చెందిన కేంద్రమంత్రి అదే కేబినెట్ భేటీలో ఉండి దీనికి అంగీకరించిన విషయం వాస్తవం కాదా ? పోలవరంలో 41 మీటర్ల ఎత్తులో నీళ్లు నిల్వచేస్తే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు అర్థం లేకుండా పోతుందన్న విషయం మీకు తెలియదా ? ఉత్తరాంధ్రలోని విశాఖ వంటి ప్రధాన నగరానికి దాదాపు 23-24 టీఎంసీ నీరు దీని ద్వారా అందించాల్సి ఉంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా సాగు నీరు అందించాల్సి ఉంది. ఇవన్నీ 45 మీటర్ల ఎత్తులో నీరు నిలబెడితేనా సాధ్యమన్న విషయం మీకు తెలియదా ? 2005లోనే రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉండగా పోలవరం అనుమతులు తెచ్చి, కేటాయింపులు అన్నీ ఖరారు చేశారు. కానీ ఇప్పుడు మీరు దాదాపు 10 టీఎంసీల నీరు అవసరమైన డేటా సెంటర్లకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారు. వీటి వల్ల విశాఖ నగరానికి ఇబ్బంది లేకుండా పోలవరం నుంచి నీళ్లు వచ్చేస్తున్నాయని చంద్రబాబు అబద్దాలు చెప్పుకుంటున్నారు. డేటా సెంటర్ల మీద ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనుమానాల ఆధారంగా స్థానికులు వీటిని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తుంటే, వారిపై మీరు నోరుపారేసుకుంటున్నారు. ఎవరు ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాల్ని వ్యతిరేకించినా వారిని దేశద్రోహులుగా, రాష్ట్రానికి ఆటంకాలు కల్పించే వారిలా చిత్రీకరిస్తారా ? మీరు ఎన్ని అరాచకాలు చేసినా ఎవరూ ఏమీ మాట్లాడకూడదా ? అని అమర్ ప్రశ్నించారు.

**ఉత్తరాంధ్ర ప్రజలకు చంద్రబాబు మరో మోసం**

చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతీసారీ లక్షల కోట్లు సంపాదించడం, వాటిని తీసుకొచ్చి ఎన్నికల్లో ఖర్చుచేయడం, తిరిగి మళ్లీ వేల కోట్లు సంపాదించే కార్యక్రమాలు మొదలుపెడతారు. చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రజలకు సాష్టాంగ నమస్కారం పెట్టాల్సిందే. గతంలో ఉమ్మడి ఏపీలో, విభజన తర్వాత కూడా ఉత్తరాంధ్రకు ఏమీ చేయలేదు కాబట్టి వారికి సాష్టాంగ నమస్కారం పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మీ 16 ఏళ్ల హయాంలో ఉత్తరాంధ్రకు మేలు చేసే ఒక్క ప్రాజెక్టు అయినా చంద్రబాబు చేపట్టారా ? మీరు చెప్పినా ఓకే, మీ తాబేదారులు చెప్పినా సరే. పైపెచ్చు పోలవరం సభ జరిగినా, గూగుల్ సభ జరిగినా జగన్మోహన్ రెడ్డి గారి ఫోబియా పట్టుకుంది. మీ ప్రతీ మాటలో జగన్మోహన్ రెడ్డి గారి భయం కనిపిస్తోంది. మీ చేతుల్లో నుంచి అధికారం చేజారిపోతోందని, ప్రజలకు వెన్నుపోటు పార్టీ చేసిన మోసం ప్రజలు గ్రహించారు, మళ్లీ ఓటేయరన్న భయం మీలో కనిపిస్తోంది. అందుకే నిత్యం జగన్నామస్మరణం చేస్తున్నారు. పోలవరం నుంచి ఎక్కడికక్కడ నీళ్లు లీక్ అయిపోతున్నాయి, అయినా ప్రచార యావ మాత్రం తగ్గడం లేదు. ఎలాగో హెరిటేజ్ ఫ్రెష్, హెరిటేజ్ మిల్క్ లాగే హెరిటేజ్ ఈవెంట్స్ అని పెట్టుకుని, ఆ డబ్బులు కూడా మీరే తీసేసుకోండి. మీ ఈవెంట్ మేనేజ్ మెంట్, ప్రచార యావ, మార్కెటింగ్ వ్యూహాల కోసం భారీగా డబ్బులు ఖర్చుపెట్టి, తిరిగి జగన్మోహన్ రెడ్డి గారిని తిట్టాలి. పోలవరం ప్రాజెక్టులో మీరు చేసినవన్నీ పాపాలే. డయాఫ్రమ్ వాల్, స్పిల్ వే, కాఫర్ డ్యామ్ విషయాల్లో మీరు చేసిన డిజైన్లు, పాడిన పాటలు, మీరు చేసిన పిక్నిక్ లు, సభలకు ఖర్చుపెట్టిన డబ్బుతో మరో పోలవరం ప్రాజెక్టు కట్టొచ్చు అని అమర్ నాథ్ ఎద్దేవా చేసారు.

# 17 ఏళ్లుగా ప్రజల గుండెల్లోనే వైఎస్ఆర్

## వర్ధంతి సందర్భంగా వైసీపీ నేతల ఘన నివాళులు



**విశాఖపట్నం, సెప్టెంబర్ 2, జయ జయహే**

మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నంలో వై.యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా సంస్కృతి విభాగం అధ్యక్షులు మారుతి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో బఋధవారం మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పార్టీ నాయకులు వేంపాడ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్క్ హోటల్ సమీపంలోని వై.యస్. ఆర్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు, పార్లమెంట్ సభ్యులు గొల్ల బాబూరావు తదితరులు పాల్గొని వై.యస్. ఆర్ విగ్రహానికి గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు మాట్లాడుతూ.. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పెన్నిధిగా, రైతు బాంధవుడిగా, విద్యా ప్రదాతగా, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. వై.యస్. ఆర్ అకాల మరణించి 17 సంవత్సరాలు గడిచినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం చెక్కుచెదరలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నా, ముఖ్యమంత్రిగా ఉన్నా తనను నమ్ముకుని తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తల పట్ల ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత మరువలేనివని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే కాకుండా భారత రాజకీయాల్లోనూ వై.యస్. ఆర్ పాలన సువర్ణ అధ్యాయంగా నిలిచిందని కెకె రాజు అన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్లు, సీట్ల కోసం కాకుండా దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో వై.యస్. ఆర్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. విద్యారంగంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. దీంతో ఎంతోమంది తల్లిదండ్రుల కలలను సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ , తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు, శాసన మండలి సభ్యులు కుంభ రవి బాబు, వరుదు కళ్యాణ్ , మాజీ పసుపులేటి బాల రాజు , మాజీ పార్లమెంట్ సభ్యులు గొడ్డేటి మాధవి, మాజీ శాసన సభ్యులు తిప్పల నాగి రెడ్డి , తైనాల విజయ కుమార్ , కోటగళ్ళు భాగ్య లక్ష్మి , పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి , పార్టీ నాయుకులు కోలా గురువులు , డాక్టర్ జహీర్ అహ్మద్, పెడాడ రమణి కుమారి, గొలగాని హరి వెంకట్ కుమారి, కట్టుమూరు సతీష్, శోభా స్వాతిరాణి, ఫరూక్, సతీష్ వర్మ, రొంగలి జగన్నాథం, పివి నారాయణ, వెంకటరమణి రెడ్డి , ఉమ్మడి స్వాతి దాస్ , నాగమల్లేశ్వరి, పేర్ల విజయ్ చందర్, ప్రచార అధ్యక్షుడు జీవీ రవిరాజు, జీలకర్ర నాగేంద్ర, ద్రోణంరాజు శ్రీ వాస్తవ, తదితరులు పాల్గొన్నారు




# కొండయ్య వలసలో ఇంటింటికీ టీడీపీ

**విజయవంతం చేసినందుకు ఇన్‌ఛార్జిలకు అభినందన**

**ఉక్కునగరం, సెప్టెంబర్ 2, జయ జయహే**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళయిన సందర్భంగా టిడిపి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వములో సంక్షేమం విజయాలు కరపత్రం ద్వారా ప్రజలకి అందించాలన్న జాతీయ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కొండయ్యవలస గ్రామంలో శాతశాతం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా 85 వార్డు కొండయ్యవలస గ్రామం 18, 19, 20 టిడిపి బూత్ ఇంచార్జ్ లు బండారు సింధూ రమేష్ , వడ్డాది శ్రీనివాస్ , బండారు జైశ్రీరామ్, డొక్కా రమేష్, పలక అచ్యుత్ , గొల్లవిల్లి



శివను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, గాజువాక అబ్జర్వర్ శ్రావణ్ కుమార్ దుస్సాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన మహిళలకు ఉచిత బస్సులు ప్రయాణం, ఏడాదికి మూడుగ్యాస్ బండలు ఉచితం, ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పెంపుదల, తల్లికి వందనం ఇంట్లో ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు చొప్పున ఇవ్వడం ఎస్సీ ఎస్టీ బీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని వాటిని ప్రజలకు జవాబుదారీగా చెప్పే బాధ్యతను తెలుగుదేశం పార్టీ తీసుకుందని రానున్న మూడేళ్లు ఇంకా మిగిలినవి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని కావున వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 85 వార్డు మాజీ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ 85 వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దశంద్ర ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ తెలుగు మహిళా నాయకురాలు మేడిశెట్టి పద్మ తదితరులు పాల్గొన్నారు..




## సీతమ్మధార హెచ్‌బీ కాలనీ ఉక్కు భూముల అమ్మకం

- ఈ-వేలానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- మొత్తం 459 ప్లాట్లను ఈ-వేలం వేయనున్న ఎనఎలఎంసీ
- మద్దిలపాలెం, గాజువాక ఆటో నగర్‌లలో కీలకమైన ప్లాట్లు
- అక్టోబర్ 12, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లో వేలం ప్రక్రియ
- ప్లాట్‌కు రూ.2 లక్షల ఈఎండీ.. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 2, జయ జయహే :**

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ - ఆరఐఎనఎల్)కు చెందిన విలువైన భూములను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎనఎలఎంసీ) ఆధ్వర్యంలో ఈ-వేలం పద్ధతిలో ఈ భూముల విక్రయ ప్రక్రియను చేపట్టారు. ఎటువంటి వివాదాలు లేని, స్పష్టమైన యాజమాన్య హక్కులు కలిగిన మొత్తం 459 ప్లాట్లను విక్రయిస్తున్నట్లు ఎనఎలఎంసీ బుధవారం ప్రకటించింది. విక్రయానికి ఉంచిన భూముల్లో అధిక శాతం నివాసయోగ్యమైన స్థలాలు ఉన్నాయి. విశాఖలోని సీతమ్మధార హెచ్‌బీ కాలనీలో 456 ఎంఐజీ, ఎలఐజీ ప్లాట్లను అమ్మకానికి ఉంచారు. జాతీయ రహదారి-16కు సమీపంలో, అన్ని మౌలిక సదుపాయాలతో ఈ ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. వీటితో పాటు గాజువాక ఆటో నగర్‌లో వాణిజ్య, లాజిస్టిక్స్ అవసరాలకు అనువైన 2,728 చదరపు గజాల స్థలాన్ని, మరో రెండు నివాస ప్లాట్లను కూడా వేలం వేస్తున్నారు. వెరసి మొత్తం 93,572 చదరపు గజాల భూమిని విక్రయించనున్నారు. ఈ ప్లాట్ల కోసం ఆన్‌లైన్ వేలం అక్టోబర్ 12, 16 తేదీల్లో జరగనుంది. రైల్‌టెల్ ఈ-నివిదా ప్లాట్‌ఫామ్ వేదికగా ఈ ప్రక్రియను నిర్వహిస్తారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, కేవైసీ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ప్రతి ప్లాట్‌కు రూ.2 లక్షల చొప్పున ధరావత్తు (ఈఎండీ) చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధీనంలో ఉన్న అదనపు, ప్రధానం కాని ఆస్తులను నగదీకరించే (మానిటైజేషన్) ప్రక్రియలో భాగంగానే ఈ విక్రయాలు చేపడుతున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఆరఐఎనఎల్ ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న సంస్థ కాగా, ఎనఎలఎంసీ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ప్రభుత్వ యాజమాన్య సంస్థ.



## స్థానిక ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేస్తాం...!

**వై.ఎస్ వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**

**క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న చంద్రబాబు..**

**పేదలకు పండ్లు, చీరలు పంపిణీ చేసిన నేతలు**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 2, జయ జయహే**

వైఎస్ సేవలు మరువలేని అందుకే ఆయన తనయుడు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డితోనే ఈ రాష్ట్ర భవిష్యత్ ఉంటుందని విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. విశాఖ జగదాంబ జంక్షన్ లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజలు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. అందుకే వచ్చే జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేస్తామన్నారు. పెరిగిన ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఎద్దేవా చేశారు. మరో పక్క డాక్టర్ వైయస్సార్ చేపట్టిన, అలాగే జగన్మోహన్ రెడ్డి హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కూటమి ప్రభుత్వం ప్రతిదీ క్రెడిట్ చోరీకి పాల్పడుతుందని దుయ్యబట్టారు. వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు మాంసం దుకాణాలకు సెలవు

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 2, జయ జయహే**

శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శుక్రవారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని మాంసం, చికెన్, చేపలు, రొయ్యలు తదితర విక్రయ దుకాణాలతో పాటు జంతు వధశాలలకు సెలవు ప్రకటించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగర పరిధిలోని సంబంధిత మాంసం, చికెన్, చేపలు, రొయ్యల విక్రయ దుకాణాలు, జంతు వధశాలలను సెప్టెంబర్ 4న తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా దుకాణాలు తెరిచి మాంసం, చికెన్, చేపలు, రొయ్యలు తదితరాలను విక్రయించినా, జంతు వధశాలలను నిర్వహించినా సంబంధిత వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



For a pure tomorrow..



## కృత్రిమ మేధ తరానికి..

# ఆలోచించే విద్య కావాలి

(ప్రతాప్)

కృత్రిమ మేధ ప్రపంచాన్ని మార్చేస్తున్న వేగాన్ని చూస్తుంటే.. రేపటి ప్రపంచానికి నేటి విద్యార్థులను సిద్ధం చేయడానికి మన విద్యా వ్యవస్థ కూడా అంతే వేగంగా మారాల్సిన అవసరం స్పష్టమవుతోంది. ఒకప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం అదనపు నైపుణ్యంగా భావించేవారు. ఇప్పుడు పరిజ్ఞానం కూడా అలాంటి అదనపు అర్హత కాదు. అది భవిష్యత్ విద్య, ఉపాధి, పరిశోధన, పరిపాలనలో ప్రాథమిక సామర్థ్యంగా మారుతోంది.

భారత్ ఈ మార్పును గుర్తించింది. జాతీయ విద్యా విధానం--2020లో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. తాజాగా 2026--27 విద్యా సంవత్సరం నుంచి 3 నుంచి 8 తరగతుల విద్యార్థుల కోసం కంప్యూటేషనల్ థింకింగ్, కృత్రిమ మేధ పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో తార్కిక ఆలోచన, నమూనాలను గుర్తించడం, అల్గారిథమ్ రూపకల్పన, డేటా అక్షరాస్యతతో పాటు బాధ్యతాయుతమైన, నైతిక కృత్రిమ మేధ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

అయితే పాఠ్యపుస్తకంలో కృత్రిమ మేధ అధ్యాయాన్ని చేర్చడం మాత్రమే సంస్కరణ కాదు. కృత్రిమ మేధని నేర్పే ముందు.. కృత్రిమ మేధతో ఎలా నేర్చుకోవాలో విద్యార్థులకు నేర్పాలి. సమాధానాలను కంఠస్థం చేసే విద్య నుంచి ప్రశ్నించే, విశ్లేషించే, సృజనాత్మకంగా ఆలోచించే విద్యకు మారాల్సిన సమయం వచ్చింది. రేపటి ఉద్యోగాల్లో కృత్రిమ మేధతో కలిసి పనిచేయగలిగే సామర్థ్యం, సమస్య పరిష్కారం, కమ్యూనికేషన్, విమర్శనాత్మక ఆలోచన వంటి మానవ నైపుణ్యాలే కీలకం కానున్నాయి.

ఇందులో ఉపాధ్యాయుల పాత్ర మరింత కీలకం. కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగించడం మాత్రమే కాదు.. వాటి సమాధానాలు సరైనవో కాదో పరిశీలించడం, పక్షపాతాలను గుర్తించడం, విద్యార్థుల డేటా గోప్యతను కాపాడటం, కృత్రిమ మేధపై అతిగా ఆధారపడకుండా చూడటం వంటి అంశాల్లో ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ అవసరం. దేశవ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయులకు కృత్రిమ మేధపై ఉచిత శిక్షణ అందించేందుకు ఐ ఐ టి మద్రాస్ అందరికీ కృత్రిమ మేధస్సు కార్యక్రమాన్ని విస్తరించడం ఈ దిశలోని ప్రయత్నాలకు ఉదాహరణ.

అంతకంటే ముఖ్యమైనది డిజిటల్ అసమానత. కంప్యూటర్లు, వేగవంతమైన ఇంటర్నెట్, ఆధునిక కృత్రిమ మేధ సాధనాలు అందుబాటులో ఉన్న విద్యార్థులతో గ్రామీణ, పేద కుటుంబాల పిల్లల మధ్య అంతరం పెరగకూడదు. 2023--24లో దేశంలోని పాఠశాలల్లో కంప్యూటర్ సదుపాయం 57.2 శాతానికి, ఇంటర్నెట్ సదుపాయం 53.9 శాతానికి చేరినప్పటికీ, అందరికీ సమానమైన డిజిటల్ ప్రాప్యత ఇంకా లక్ష్యంగానే ఉంది.

కృత్రిమ మేధ విద్యలోకి రావడం వల్ల మరో ప్రమాదం కూడా ఉంది. విద్యార్థి స్వయంగా ఆలోచించాల్సిన చోట కృత్రిమ మేధతో సమాధానం రాయించుకోవడం అలవాటైతే సృజనాత్మకత, పరిశోధనా సామర్థ్యం దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే కృత్రిమ మేధని ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయంగా కాకుండా సహాయకుడిగా, విద్యార్థికి ఆలోచనకు ప్రత్యామ్నాయంగా కాకుండా ఆలోచనను విస్తరించే సాధనంగా చూడాలి. యునెస్కో కూడా కృత్రిమ మేధ వినియోగంలో మానవ కేంద్రిత, సమానత్వం, గోప్యత, నైతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తోంది.

భారత్ విద్యా వ్యవస్థకు ఇప్పుడు అసలు పరీక్ష ఇదే. కృత్రిమ మేధని పాఠ్యాంశంగా చేర్చడం ఒక ప్రారంభం మాత్రమే. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ, ప్రాంతీయ భాషల్లో నాణ్యమైన డిజిటల్ కంటెంట్, పరిశోధన, డేటా భద్రత, నైతిక ప్రమాణాలు---ఇవన్నీ సమగ్రంగా మారాలి. విద్యార్థులను కేవలం కృత్రిమ మేధ ఉపయోగించే తరంగా కాకుండా, కృత్రిమ మేధని బాధ్యతగా సృష్టించే, ప్రశ్నించే, నియంత్రించే తరంగా తీర్చిదిద్దాలి.


భవిష్యత్తు తరగతి గదిలో ప్రశ్న మారబోతోంది---"కృత్రిమ మేధ నీకు సమాధానం చెప్పగలదా?" కాదు. "కృత్రిమ మేధ ఇచ్చిన సమాధానాన్ని నువ్వు ఆలోచించి, పరిశీలించి, మెరుగుపరచగలవా?" అన్నదే. ఆ మార్పుకు మన విద్యా వ్యవస్థ సిద్ధపడినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యానికి అవసరమైన మానవ వనరులను నిర్మించగలం.



# పెరుగుతున్న ఆదాయం.. కరుగుతున్న పొదుపు

(ప్రతాప్)

**జీతం పెరుగుతుంది. కానీ నెలాఖరుకు మిగిలేది పెరగడం లేదు. ఆదాయం పెరిగినంత వేగంగా ఖర్చులు తగ్గకపోవడం మధ్యతరగతి కుటుంబాల ప్రధాన ఆందోళనగా మారుతోంది. పన్నులు, ద్రవ్యోల్బణం, విద్య--వైద్య ఖర్చులు, ఇల్లు, రవాణా, రుణ వాయిదాలు.. ఇలా ఒకేసారి అనేక వైపుల నుంచి పడుతున్న ఆర్థిక ఒత్తిడి మధ్యతరగతి కుటుంబాల పొదుపు సామర్థ్యాన్ని క్రమంగా కుదిస్తోంది.**



భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలమైన వృద్ధిని నమోదు చేస్తోంది. 2026 ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం పెరిగింది. వినియోగ వ్యయం కూడా 7.1 శాతం వృద్ధి చెందింది. అయినప్పటికీ, దేశ ఆర్థిక వృద్ధి వేగం, ఒక కుటుంబం అనుభవించే ఆర్థిక సౌలభ్యం ఒకటే కావు. ఇదే మధ్యతరగతి సమస్యను అర్థం చేసుకోవాల్సిన మొదటి అంశం.

ధరల పెరుగుదల దీనికి ప్రధాన కారణం. 2026 జూలైలో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి చేరింది. ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతంగా నమోదైంది. అంటే సగటున ధరలు నాలుగైదు శాతం పెరుగుతున్నాయన్నమాట. అయితే కుటుంబ బడ్జెట్‌లో అత్యవసర వస్తువుల వాటా ఎక్కువగా ఉన్నవారికి సగటు ద్రవ్యోల్బణం కంటే వారి వ్యక్తిగత ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండవచ్చు. కూరగాయలు, పాలు, పాఠశాల ఫీజులు, వైద్యం, రవాణా వంటి ఖర్చులు



పెరిగితే కుటుంబం వెంటనే స్పందించాల్సిందే.

గణాంకాలు కూడా వినియోగ వ్యయం పెరుగుతున్నదే కాక, దాని పరిమాణాన్ని చూపుతున్నాయి. 2023--24లో పట్టణ ప్రాంతాల్లో తలసరి నెలవారీ వినియోగ వ్యయం రూ.6,996గా ఉంది. 2022--23లో ఇది రూ.6,459. ఇది కేవలం సగటు వినియోగ వ్యయం మాత్రమే; మధ్యతరగతి కుటుంబాల వాస్తవ బడ్జెట్‌లో ఇల్లు, పిల్లల విద్య, ఆరోగ్య బీమా, రవాణా, డిజిటల్ సేవలు, రుణ వాయిదాలు వంటి అంశాలను కలిపితే ఒత్తిడి మరింత స్పష్టమవుతుంది.

ఇక పన్నుల విషయానికి వస్తే పరిస్థితిని ఏకపక్షంగా చూడకూడదు. 2025--26 నుంచి కొత్త ఆదాయపన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయానికి రిబేట్ లభించేలా మార్పులు జరిగాయి. 2026--27 బడ్జెట్‌లో కేంద్రం నికర పన్ను ఆదాయాన్ని రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేసింది. అంటే ప్రత్యక్ష పన్నుల విషయంలో ప్రభుత్వం కొంత ఉపశమనం కల్పించినా, మధ్యతరగతి కుటుంబం చెల్లించే మొత్తం పన్ను భారాన్ని ఆదాయపన్నుతో మాత్రమే కొలవడం సరైంది కాదు. వస్తువులు, సేవల కొనుగోళ్లలో పరోక్ష పన్నులు కూడా కుటుంబ వ్యయంతో పాటు సాగుతాయి.

ఇక్కడ అసలు సమస్య ఆదాయం--ఖర్చు--పొదుపు మధ్య సమతుల్యత. జీతం 8 శాతం పెరిగినా, కుటుంబం ఎదుర్కొనే అవసరమైన ఖర్చులు 10 శాతం పెరిగితే వాస్తవంగా ఆ కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడదు. ఖర్చులు పెరిగినప్పుడు ముందుగా తగ్గేది విలాసం కాదు.. పొదుపు. ఆ తర్వాత పెట్టుబడి. చివరకు అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడే ఆర్థిక భద్రత.

ఆందోళన కలిగించే మరో అంశం కుటుంబాల రుణభారం. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 2023--24లో కుటుంబాల రుణభారం జీడీపీలో 41.5 శాతానికి పెరిగింది; 2022--23లో ఇది 39.4 శాతం. అదే సమయంలో కుటుంబాల నికర ఆర్థిక పొదుపు 5.2 శాతం వద్ద ఉంది. 2024--25లో నికర కుటుంబ ఆర్థిక పొదుపు కొంత మెరుగై 7 శాతానికి చేరినా, రుణాలు--పొదుపుల మధ్య సమతుల్యతపై అప్రమత్తత అవసరమే.

అందుకే మధ్యతరగతికి కావాల్సింది కేవలం పన్ను రాయితీ కాదు; స్థిరమైన జీవన వ్యయ వాతావరణం. ఆహార ధరల స్థిరీకరణ, నాణ్యమైన ప్రభుత్వ విద్య--వైద్యం, సరసమైన గృహ వసతి, ప్రజా రవాణా, ఉద్యోగ భద్రత, దీర్ఘకాలిక పొదుపులకు ప్రోత్సాహం వంటి చర్యలు కుటుంబాల వాస్తవ ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి.

దేశం వేగంగా అభివృద్ధి చెందడం అవసరమే. కానీ ఆ అభివృద్ధి ఫలితాలు కుటుంబాల నెలాఖరు బడ్జెట్‌లో కనిపించినప్పుడే అది సమ్మిళిత అభివృద్ధి అవుతుంది. మధ్యతరగతి వినియోగదారుడు మాత్రమే కాదు.. దేశ పొదుపులు, పెట్టుబడులు, పన్ను ఆదాయానికి కీలక ఆధారం. అతని చేతిలో మిగిలే ఆదాయం తగ్గితే చివరికి దాని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. అందుకే మధ్యతరగతి ఆర్థిక భారం ఒక కుటుంబ సమస్య కాదు; దేశ ఆర్థిక విధానానికి ఒక ముఖ్యమైన పరీక్ష.

# ప్రజాస్వామ్యంలో.. డేటానే దిక్సూచి

(ప్రతాప్)

**ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు, ఓట్లు, ప్రభుత్వాల మార్పు కాదు. ప్రజల అవసరాలను తెలుసుకుని, వాటి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం కూడా ప్రజాస్వామ్యంలో అంతే కీలకం. ఆ అవసరాలను కొలిచేది డేటా. అందుకే ప్రజాస్వామ్యంలో విశ్వసనీయమైన గణాంకాలు ఒక ప్రభుత్వానికి పరిపాలనా సాధనం మాత్రమే కాదు.. ప్రజలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఆయుధం కూడా.**




ఒక ఉదాహరణ తీసుకుంటే విషయం స్పష్టమవుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నమోదైన ఓటర్ల హాజరు 65.79 శాతం. తుది గణాంకాల్లో పోస్టల్ బ్యాలెట్లను కలిపితే మొత్తం ఓటింగ్ శాతం 66.10గా నమోదైంది. మహిళల ఓటర్ల హాజరు 65.78 శాతం, పురుషులది 65.55 శాతం. అంటే మహిళల ఓటింగ్ భాగస్వామ్యం పురుషుల కంటే కొద్దిగా ఎక్కువ. ఇలాంటి గణాంకాలే భారత ప్రజాస్వామ్యంలో మహిళల రాజకీయ భాగస్వామ్యం ఎలా మారుతోందో అర్థం చేసుకోవడానికి ఆధారం.అయితే ఎన్నికల డేటా మాత్రమే కాదు. జనాభా, నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి, జీడీపీ వంటి ప్రతి గణాంకం ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తుంది. తప్పు డేటా ఆధారంగా తీసుకున్న నిర్ణయం తప్పు దిశలో వనరులను మళ్లించవచ్చు. ఉదాహరణకు ఒక ప్రాంతంలో పాఠశాల వయసు పిల్లల సంఖ్యను తక్కువగా అంచనా వేస్తే అక్కడ అవసరమైన తరగతి గదులు, ఉపాధ్యాయుల నియామకం తగ్గవచ్చు. వృద్ధుల సంఖ్యను తక్కువగా లెక్కిస్తే ఆరోగ్య, సామాజిక భద్రతా పథకాలు కూడా తగిన స్థాయిలో ఉండకపోవచ్చు.

ఇటీవల భారతదేశం జీడీపీ గణన పద్ధతిని మార్చడం కూడా డేటా నాణ్యత ప్రాధాన్యాన్ని చూపుతుంది. కొత్త జీడీపీ సిరీస్‌లో 2022--23ను ప్రాతిపదిక సంవత్సరంగా తీసుకున్నారు. ఉత్పత్తి విలువను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి గతంలో సుమారు 180 ధర అంశాలను ఉపయోగించగా, కొత్త విధానంలో దాదాపు 500--600 అంశాలను ఉపయోగిస్తున్నారు. ఉత్పత్తి, ఇన్‌పుట్ ధరలను వేర్వేరుగా సర్దుబాటు చేసే 'డబుల్ డిఫ్లేషన్' పద్ధతినీ ప్రవేశపెట్టారు.

దీని అర్థం గణాంకాలు మారడం తప్పు అని కాదు. కొత్త సమాచారం, మెరుగైన పద్ధతులు అందుబాటులోకి వచ్చినప్పుడు గణాంకాలను సవరించడం మంచి గణాంక వ్యవస్థకు లక్షణం. అయితే ఆ మార్పులు ఎందుకు జరిగాయి, ఏ పద్ధతిని ఉపయోగించారు, పాత--కొత్త గణాంకాలను ఎలా పోల్చాలి అన్నది ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. పారదర్శకత లేని గణాంక సవరణలు అనుమానాలకు తావిస్తాయి.

ఇక్కడే స్వతంత్ర గణాంక వ్యవస్థ ప్రాధాన్యం పెరుగుతుంది. గణాంకాలను రూపొందించే సంస్థలపై రాజకీయ లేదా పరిపాలనా ఒత్తిడి ఉండకూడదు. గణాంకాల సేకరణ పద్ధతి, నమూనా ఎంపిక, లోపాల పరిమితి, సవరణ విధానం వంటి అంశాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ 2026 గణాంక డేటా విడుదల మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చింది. డేటా ప్రైవసీ, గోప్యతను కాపాడుతూ అధికారిక గణాంకాలకు ప్రాప్యతను మెరుగుపరచడం వాటి లక్ష్యం.

ఇక డిజిటల్ యుగంలో సమస్య మరో రూపం దాల్చింది. సామాజిక మాధ్యమాల్లో ఒక సంఖ్యను ఆధారం లేకుండా ప్రచారం చేస్తే అది గంటల్లోనే లక్షల మందికి చేరుతుంది. తప్పుడు డేటా ఇప్పుడు కేవలం తప్పు సమాచారం కాదు.. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే సాధనం. అందుకే ప్రభుత్వాలు విడుదల చేసే అధికారిక గణాంకాలపై ప్రజలకు నమ్మకం ఉండటం ఎంత ముఖ్యమో, మీడియా--పౌర సమాజం వాటిని బాధ్యతగా పరిశీలించడం కూడా అంతే ముఖ్యం.

అందువల్ల డేటా విశ్వసనీయతకు మూడు ప్రమాణాలు తప్పనిసరి---ఖచ్చితత్వం, పారదర్శకత, స్వతంత్రత. గణాంకాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండాల్సిన అవసరం లేదు; అవి వాస్తవానికి అనుకూలంగా ఉండాలి. వాస్తవం ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఒకే ప్రమాణంతో కొలవాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు ఎంత పవిత్రమో.. ప్రజల గురించి చెప్పే డేటా కూడా అంతే పవిత్రం. ఓటును తారుమారు చేస్తే ఎన్నికల విశ్వసనీయత దెబ్బతింటుంది; డేటాను వక్రీకరిస్తే పరిపాలన విశ్వసనీయత దెబ్బతింటుంది. తప్పు గణాంకాలతో సరైన విధానాన్ని నిర్మించలేం. సరైన డేటా లేకుండా పేదరికాన్ని తగ్గించలేం, నిరుద్యోగాన్ని కొలవలేం, విద్య--ఆరోగ్య అవసరాలను గుర్తించలేం, అభివృద్ధి ఫలితాలను అంచనా వేయలేం. అందుకే ప్రజాస్వామ్యానికి కేవలం ప్రజల స్వరం మాత్రమే కాదు.. ఆ స్వరాన్ని వాస్తవంగా ప్రతిబింబించే నమ్మకమైన డేటా కూడా కావాలి. చివరికి, ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో బ్యాలెట్ పెట్టెలో మాత్రమే కాదు---దేశం తన వాస్తవాలను ఎంత నిజాయితీగా లెక్కపెడుతుందో కూడా నిర్ణయిస్తుంది.

# సీఆర్‌జెడ్-2019 డ్రాఫ్ట్‌పై సాఫీగా ప్రజాభిప్రాయ సేకరణ





**చిల్డ్రన్స్ ఎరీనాలో కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధ్యక్షతన నిర్వహణ**

**పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ కార్యకలాపాలుండాలన్న ప్రజలు**

**ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీఈఈ రాజశేఖర్, ఇతర అధికారుల హాజరు**

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 2, జయ జయహే**

సీఆర్‌జెడ్ నోటిఫికేషన్-2019 అమలుకు సంబంధించిన మ్యాపుల రూపకల్పన, భూముల వినియోగం, ఇతర నిబంధనలపై విశాఖలోని ఉడా చిల్డ్రన్ ఏరినాలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రాజశేఖర్, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రతినిధులతో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విశాఖ ఈఈ ముకుందరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి మాధవి ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందుగా సీఆర్జెడ్-1,2,3,4 నిబంధనలను, ఇతర అంశాలను వివరిస్తూ నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్మెంట్, చెన్నై నుంచి హాజరైన సైంటిస్ట్ మానిక్ మహాపాత్రో, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రతినిధి షేక్ సుభాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. 2011 నోటిఫికేషన్, 2019 నోటిఫికేషన్ల మధ్య వ్యత్యాసాలను, జరిగిన సవరణలను స్పష్టంగా తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఎక్కువ మంది మధురవాడ సరిహద్దు నుంచి భీమునిపట్నం వరకు తీర ప్రాంతాన్ని సీఆర్జెడ్-3 నుంచి సీఆర్జెడ్ -2గా పునర్వర్గీకరించాలని విన్నవించారు. తాత్కాలిక స్ట్రక్చర్లు వేసుకొని కార్యకలాపాలు కొనసాగించుకునేలా అవకాశం కల్పించాలని కొంతమంది ఔత్సాహికులు ఈ సందర్భంగా కోరారు.

**అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత: జిల్లా కలెక్టర్**

ప్రజల నుంచి వచ్చిన అన్ని సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకున్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ ప్లాన్‌లను జాతీయ స్థాయి అథారిటీకి సమర్పిస్తుందని చెప్పారు. జాతీయ స్థాయిలో తుది పరిశీలన, ఆమోదం అనంతరం సీఆర్జెడ్-2019 నోటిఫికేషన్ రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కలెక్టర్ వివరించారు. 2019 సీఆర్‌జెడ్ నోటిఫికేషన్ ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలత కల్పించడంతోపాటు తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణకు సముచిత ప్రాధాన్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించడమే డ్రాఫ్ట్ జీజెడఎంపీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అభిప్రాయాన్ని, అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుని నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు.



# వైఎస్ఆర్ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తాం...!

**- వైసీపీ ఉత్తరాంధ్ర ప్రచార విభాగం అధ్యక్షులు జీవీ రవిరాజు**

**- వృద్దులకు భోజనం వడ్డించిన ఎంపీ బాబూరావు**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 2, జయ జయహే**

ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జలయజ్ఞం ప్రదాత స్వర్గీయ డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన కార్యక్రమాన్ని వైసీపీ ఉత్తరాంధ్ర ప్రచార విభాగం అధ్యక్షులు జీవీ రవిరాజు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు హాజరై వృద్ధులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని, ఆయన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయడం ద్వారా ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డేటి గంగామహేష్, మొండి రామకృష్ణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, బాద్రి శ్రీనివాస్, లంకా రాము, పొన్నాడ కనకారావు, పైడిరాజు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బాబూ రావు వృద్ధాశ్రమంలోని వృద్ధులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



## జడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నాయుడుపేట, సెప్టెంబర్ 2,జయ జయహే**

నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రాంగణంలోకి కుక్కలు, ఇతర జంతువులు ప్రవేశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ పాఠశాల అవసరాల కోసం టైల్స్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేందర్ రెడ్డి, నాయుడుపేట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మట్టి గణేశ విగ్రహాల తయారీలో శ్రీ సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు

**పర్యావరణ హితమైన వినాయక చవితికి సందేశమిస్తున్న చిన్నారులు**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 2, జయ జయహే**

మానవతా విలువలతో కూడిన ఉన్నతమైన విద్యను అభ్యసించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించుకుంటూ శ్రీ సత్యసాయి విద్యా విహార్ స్కూలు విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. వచ్చే వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషిగా, స్కూలు కన్వీనర్, యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ప్రేరణతో విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో స్వయంగా మట్టి గణేశ విగ్రహాలను తయారు చేస్తున్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో మట్టితో గణేశ విగ్రహాలను రూపొందిస్తూ, పర్యావరణ పరిరక్షణపై అవగాహనను ఆచరణలో చూపిస్తున్నారు. అనంతరం వారు తయారు చేసిన మట్టి గణేశ విగ్రహాలను ప్రేమపూర్వకంగా స్కూలు ఉన్న ఎంవీపీ పరిసర ప్రాంతాల ప్రజలకు బహుకరిస్తున్నారు. గత పది సంవత్సరాలకు పైగా శ్రీ సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు ఈ పర్యావరణహిత కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 300 మట్టి గణేశ విగ్రహాలను విద్యార్థులు స్వయంగా తయారు చేయడం విశేషం. మట్టి గణేశ విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రకృతి పట్ల ప్రేమ, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. "విద్య అంటే కేవలం జ్ఞానాన్ని పొందడం కాదు... మానవతా విలువలతో పాటు ప్రకృతిని ప్రేమించి, సంరక్షించే బాధ్యతను నేర్చుకోవడం కూడా." అని శ్రీ సత్యసాయి విద్యా విహార్ విద్యార్థుల ఈ పర్యావరణహిత కార్యక్రమం "ప్రేమతో సేవ - బాధ్యతతో పరిరక్షణ" అనే సందేశాన్ని సమాజానికి అందిస్తున్నారు.



## పుట్టపర్తిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**- విశాఖ నుంచి 2 వేల మంది భక్తులు రాక**

**పర్తి యాత్రకు భారీ ఏర్పాట్లు చేస్తున్న శ్రీ సత్యసాయి సేవా సంస్థలు**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 2, జయ జయహే**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య సన్నిధిలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక, సాంప్రదాయ వేడుకల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం జిల్లా నుండి సుమారు 2 వేల మంది భక్తులు బుధవారం పుట్టపర్తికి చేరుకున్నారు. వీరంతా సెప్టెంబర్ 3, 4, 5 తేదీలలో మూడు రోజుల పాటు పర్తి యాత్ర నిర్వహిస్తూ, భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొంటారు. ఈ వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ 4న సాయంత్రం 7 గంటలకు పుట్టపర్తిలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం (ఓల్డ్ మందిర్) వద్ద నిర్వహించనున్న సాంప్రదాయ 'ఉట్టి కొట్టడం' కార్యక్రమానికి శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్. జె. రత్నాకర్‌ని విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, ఇతర పురుష జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అలాగే నాయుడు సతీమణి బాల త్రిపురసుందరి నేతృత్వంలో ఈశ్వరి, జయ మల్లాది, సోమేశ్వరి, లక్ష్మి, రాధా సత్యవరపు తదితరులతో కూడిన మహిళా బృందం హిమవాహిని రత్నాకర్‌ని కూడా ఉట్టి కొట్టడం వేడుకకు ఆర్. జె. రత్నాకర్‌తో కలిసి విచ్చేసి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.



## చీడికాడ మండలంలో ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

**మాడుగుల, సెప్టెంబర్ 2, జయ జయహే**

మాడుగుల నియోజక వర్గ పరిధిలో గల చీడికాడ మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చెట్టుపల్లి గ్రామంలో జరిగిన రక్తదాన శిబిరం లో యువకులు స్వచంధంగా పాల్గొని 35 యూనిట్ల బ్లడ్ డొనేట్ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఆచార్య నన్నయ్య యూనివర్సిటీ ఎక్స్ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలు నాయుడు విచ్చేసి యువకులకు సర్టిఫికెట్స్ అందజేశారు. అలాగే తునివలస గ్రామంలో సుమారు 1600 మందికి డొక్కా సీతమ్మ పేరు మీద అన్నదాన కార్యక్రమం తునివలస గ్రామ నాయకుల సహకారంతో నిర్వహించారు. అలాగే మండలంలో ప్రతి గ్రామంలో మొక్కలు పంపిణీ దేశభక్తి గేయాల పాటల పోటీలు వివిధ సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా జనసేన పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన యువజన విభాగ కార్యక్రమం మండల జనసైనికులు అందరూ స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు జి వి మూర్తి మండల నాయకులు కృష్ణ ,సంతోష్ ,సూరిబాబు ,కిరణ్ ,రాము ,కొండల రావు ,శేఖర్, గణేష్ ,ప్రసాద్ ,అప్పారావు ,రామారావు ,అప్పలనాయుడు, శివ ,కృష్ణ మూర్తి ఇతరులు పాల్గొన్నారు.

## మాడుగులలో పవన్ జన్మదిన వేడుకలు

**మాడుగుల సెప్టెంబర్ 2 జయ జయహే**



జనసేన అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతి రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు బుధవారం పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి రోబ్బ మహేష్ ఆధ్వర్యంలో మాడుగులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా మాడుగుల మొదకొండమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ శ్రామికుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి మాడుగుల అన్నా కేంటిన్ లో పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్బంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల పట్టణ జనసైనికులు కోళ్ల చిన్న, గళ్ళ గణేష్, దర్మిశెట్టి అప్పి, చల్ల ఆనంద్, వేపాడ నాగరాజు, సింగ్, షాపి శ్రీను, నూకరాజు, బాబ్జి, తురిబిల్లి శ్రీను, గండి హరీష్ పాల్గొన్నారు.

## కాఫీ తోట కార్మికుల పిల్లలకు విద్యా ఉపకార వేతనాలు

**దరఖాస్తులకు సెప్టెంబర్ 8 ఆఖరి తేదీ.**

**వెల్లడించిన కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు**

**అనంతగిరి/పాడేరు: సెప్టెంబర్ 2(జయ జయహే)**



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ తోట కార్మికుల పిల్లల కోసం 2026--27 ఆర్థిక సంవత్సరానికి విద్యా ఉపకార వేతనాలు, ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు శెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ లోగా సమర్పించాలని కోరారు. 11వ తరగతి, రూ. 5,000 అందిస్తారని. పదిలో అత్యధిక మార్కులు సాధించిన ఒక అబ్బాయి, ఒక అమ్మాయికి విడివిడిగా రూ. 2,500 ఇస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కాఫీ తోటలు/క్యూరింగ్ వర్క్‌లో పనిచేసే ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల కార్మికుల మొదటి ఇద్దరు సంతానం అర్హులు. క్లర్కులు, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మేనేజర్ల పిల్లలకు ఇది వర్తించదు. నిర్ణీత దరఖాస్తులను రెండు ప్రతులలో పూరించి.. ఫోటో, ఆధార్, స్టడీ సర్టిఫికేట్, యజమాని సర్టిఫికేట్ కొండపోడు పట్టా కలిగిన రైతులు 10 తరగతి మార్కుల పత్రం, బ్యాంకు పాస్‌బుక్ కాపీలతో జతచేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మినుములూరు (పాడేరు) లోని కాఫీ బోర్డ్ కార్యాలయంలో నేరుగా అందజేయాలని శెట్టి రాజు స్పష్టం చేశారు. పూర్తి వివరాలు కోసం 8332965696 నంబర్కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

## చోడవరంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

**చోడవరం సెప్టెంబర్ 2 జయ జయహే**



దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు బుధవారం చోడవరం నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి, ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ కొత్తూరు జంక్షన్ లో గల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గుమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాడి కాసమ్మ, వైసిపి నాయకులు వై సత్య రావు, దేవరపల్లి సత్య, ముక్క మహాలక్ష్మి నాయుడు, ఓరుగంటి నెహ్రూ, సిమ్ము నాయుడు తో పాటు చోడవరం నియోజకవర్గంలో గల 4 మండలాల ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా





**అరకులోయ: జయ జయహే,**

అరకు వేలి మండల కేంద్రంలో బుధవారం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా అరకు నియోజకవర్గంలో జనసేన శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. అరకు నియోజకవర్గ ఇంచార్జ్ చెట్టి చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, యువత, వీర మహిళలు భారీగా తరలివచ్చారు. అరకు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రసంగం యువ గళం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రీన్ వ్యాలీ నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమైంది. బైక్ ర్యాలీ ఏపీ టూరిజం వరకు సాగింది. అక్కడి నుంచి యూటర్న్ తీసుకుని తిరిగి అరకు పట్టణానికి చేరుకుని అరకు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఘనంగా కేక్ కటింగ్ నిర్వహించారు. జనసేన జెండాలతో, నినాదాలతో అరకు పట్టణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి కొన్నేడి లక్ష్మణరావు, బంగురు రామదాసు, ఆరు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు, జనసేన పార్టీ అరకు వేలి మండల నాయకులు జన్ని రవికుమార్, నాయకులు సమర్ధి రఘునాథ్, సత్యానాదం, మధు, సత్తిబాబు, రామకృష్ణ, మురళి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు



# చిన్నలబుడులో రాజ్మా విత్తనాలు పంపిణీ

**అరకులోయ: జయ జయహే.**

అరకు వేలి మండలం చిన్నలబుడు పంచాయితీ రైతు భరోసా కేంద్రంలో స్థానిక గిరిజన రైతులకు సచివాలయం అగ్రికల్చర్ పుణ్యవతి ఆధ్వర్యంలో రాజ్మా విత్తనాలు పంపిణీ కార్యక్రమం ఈ సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయితీ టిడిపి పార్టీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ పాల్గొన్నారు. రైతులను రాజ్మా విత్తనాలను అందజేశారు, రైతులు పంట పొలాలలో రాజ్మా విత్తనాలు పంట సాగు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ మస్య , రంజిత్, టిడిపి మాజీ వార్డు మెంబర్ తాంగుల డొంబురు, పీసా కమిటీ మధు, పీసా కమిటీ జగన్, తదితరులు పాల్గొన్నారు



# బాధ్యత మరిచిన అధికారులు

## గరిమండ స్కూల్లో పిల్లలకు పస్తులు...

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 03,**

కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ గరిమండ యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్ కావడంతో గిరిజన చిన్నారులు పస్తులుండాల్సి వచ్చింది.బుధవారం పాఠశాలలో భోజనం వండలేదు. తల్లిదండ్రులకు, విద్యార్థులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. దీంతో భోజనం సమయానికి పిల్లలు ఇబ్బంది పడ్డారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంట్లో లేకపోవడంతో పిల్లలు ఇంటికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని గ్రామస్తులు మండిపడుతున్నారు. దీనికి కారణం టీచరా? వంట నిర్వాహకురాలా? అనేది తేల్చి, బాధ్యులపై చర్య తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు..



# మృతిచెందిన ఆశ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

## ప్రభుత్వం ఆదుకోవాలని ఆశ కార్యకర్తల యూనియన్ నాయకుల విజ్ఞప్తి

**ముంచంగిపుట్టు, జయ జయహే:**


మండలంలోని బరడ పంచాయతీ పుచ్చేలి గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త పొదువ మొత్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో బుధవారం లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు కిముడు శాంతమ్మ, సీసా జయసుధ, మహేశ్వరి పుచ్చేలి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతిచెందిన ఆశ కార్యకర్త పొదువ మొత్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్న పొదువ మొత్తి అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమన్నారు. ఆమె ఆకస్మిక మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన బెనిఫిట్స్ ఏవైనా ఉంటే వాటిని ఆమె కుటుంబ సభ్యులకు అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆశ కార్యకర్తలు తమ వంతుగా విరాళాలు సేకరించి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, మృతురాలి కుటుంబ సభ్యులు ప్రహ్లాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలేవి

**డుంబ్రిగూడ: జయ జయహే.**

మండలంలోని అరకు పంచాయతీ నేరేడువలస సమీపంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొంతమంది గిరిజనేతరులు కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ స్థలం సర్వే నెంబర్ 54-3లో సుమారు 1ఎకరం16సెంటు పాఠశాలకు గతంలో కేటాయించడం జరిగిందని రెవిన్యూ అధికారులు చెప్పారని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు,స్థానిక ఫీసా కార్యదర్శి, అధ్యక్షులు, గ్రామ పెద్దలు కలిసి జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్, ఎమ్మార్వో , పంచాయతీ కార్యదర్శి కు పిర్యాదు చేసిన ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోపోవడం దుర్మార్గం అన్నారు. కబ్జా చేసిన స్థలాన్ని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకొని పాఠశాలకు అప్పజెప్పాలనీ డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే గ్రామ ప్రజలు, విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలిసి పోరాటం కొనసాగిస్తామనీ హెచ్చరించారు.అరకు పంచాయతీ కేంద్రంలో రోజురోజుకి అక్రమ కట్టడాలు, ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురి అవుతుందని, రెవిన్యూ, పంచాయతీ అధికారులు కాపాడటంలో పూర్తిగా విఫలం చెందారనీ చెప్పారు. కొంతమంది రాజకీయ నాయకులు తమస్వ ప్రయోజనం కోసం గ్రామ కంఠం భూములు ఆక్రమణలు చేసి గిరిజనేతరులకు అమ్మకం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి సురేష్ కుమార్, ఫీసా అధ్యక్షులు పెలమాల అనీల్,కార్యదర్శి పెట్టెలి రామకృష్ణ, మాజీ ఎంపీపీ చటారి సాయిబాబా ,తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాలు

**మునగపాక, సెప్టెంబర్ 2, జయ జయహే:**

మాజీ ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాలను ఎలమంచిలి నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. మునగపాక మండలంలో ఉమ్మలాడ గ్రామంలో మరియు తిమ్మరాజుపేటలో నియోజవర్గ ఇన్చార్జి తనకాల అనంత రావు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల గుండెచప్పుడు రాజశేఖర్ రెడ్డి అని ఒకపక్క సంక్షేమం ఇంకో పక్క అభివృద్ధి. జలయజ్ఞం పేరుతో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన ఘనత రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. లక్షలాది పేద విద్యార్థులు ఫీజు రీయంబర్స్మెంట్ తో ఇంజనీరింగ్ వంటి అనేక ఉన్నత చదువులు ఉచితంగా చదివారని అన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం.వి.ఆర్ రాహుల్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే తన ధ్యేయం అని రాజశేఖర్ రెడ్డి ప్రకటించారని, ఆయన కలలు నిజం చేయాలంటే ప్రతి వైయస్సార్ అభిమాని కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంకణాల నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోజిల్లా మత్స్యకార సెల్అధ్యక్షులు మేరుగు అచ్చిబాబు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు గోతులు పడిన అధికారులు పట్టించుకోరా

## వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు డిమాండ్

**అల్లూరి జిల్లా అనంతగిరి**

**జయ జయహే**

వేంగడ పంచాయతీ పరిధిలో గల వేంగడ. జంబువలస గ్రామం వరకు 4.కిలోమీటర్లు దురం ఉన్నది. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పట్కా రోడ్డు పనులకు.జరుగుతుంది.ఏవి లారీలతో పిక్క.. మోస్తూ రోడ్డు లో. వేంగడ తారు రోడ్డు మీదుగా తీసుకొని వెళ్లడంతో.వేంగడ గ్రామం నుండి జంబూవలస గ్రామం వరకు. తారు రోడ్డు మొత్తం జుంబు వలస వరకు జరిగింది. అక్కడ అక్కడ. గోత్తులు కావడం జరిగింది. అనంతగిరి. పి అర్ ఐ.జె ఇ. గణేష్ ను ఫోన్ ద్వారా తెలియజేయడం జరిగింది. జె ఇ. మాట్లాడడం జరిగింది హుకుంపేట జె ఇ జైగర్ మాట్లాడి 2యూనిట్ లారీలు తిపెలా మాట్లాడుతాను. అని హామీ ఇచ్చారు. ఏవి లారీలు వేంగడ రోడ్డు లో తీపుతూనే ఉన్నారు. ఏవి లారీలు తిప్పడం తో. రోడ్డు మొత్తం పాడై పోతుంది. అని ప్రజలు చెప్పారు రోడ్డు పాడైన తర్వాత. రోడ్డు వెచ్చే అధికారులు. ఉందరు. గతంలో. ముంతా తుపాన్ కు రోడ్డు కొని చోట్ల రోడ్డు కొరుకు పోయింది అని కలెక్టర్ పి ఓ పిర్యాదు చేసాము. కాని మరమ్మతులు. చెయ్యలేదు. ఈ రోడ్డు కూడా పోతే. అంబులెన్సు వెళ్లడానికి దారి ఉండదని కొండలరావు కోరారు.అధికారులు స్పందించి. 2.యూనిట్ లారీలు తిపెలా చూడాలని కోరుతున్నారు.



# వినాయక చవితి గోడపత్రిక ఆవిష్కరణ

**చోడవరం సెప్టెంబరు 2 జయ జయహే**

ఈనెల 14 నుంచి వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం చోడవరం స్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు ఈనెల 22 వ తేదీవరకు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రతిష్టాత్మక నిర్వహించాలని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే కరపత్రాలు బ్యానర్లు కూడా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగా శ్రీనివాసరావు, ధర్మకర్తలు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, జయసింహా, యడ్ల వరలక్ష్మి, బండి సంతోషికుమారి, మల్లువలస ఈశ్వరమ్మ, అర్చకులు కొడమంచిలి చలపతి, షణ్ముఖ శ్రీనివాస్, దేవాదాయశాఖ కార్య నిర్వహణ అధికారి నీ కె.బి. ఆశా కీరణ్మయి, కూటమి నాయకులు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

**అరకులోయ: జయ జయహే.**



కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏజెంట్గా పని చేస్తు కొమ్ముకాస్తున్న రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రాజీనామా చేయాలని అల్లూరి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు శెట్టి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు, మంత్రి సంధ్యారాణి కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏజెంట్గా మారి విద్య సంవత్సరం మధ్యలో 480 మంది విశాఖ జిల్లా ఏపీ టీ డబ్ల్యూ ఆర్ పాఠశాల ఆదివాసి గిరిజన విద్యార్థులకు వారి విద్య భవిష్యత్ సర్వనాశనం చేయడం విద్యార్థులు భవిష్యత్ తో ఒక గిరిజన మంత్రి అయి ఉండి తల్లితండ్రుల అనుమతి గిరిజన ప్రజా సంఘాల అనుమతి లేకుండా ఆదివాసి విద్యార్థులకు మానసికంగా వేధింపు చేసి స్కూల్ నుంచి బలవంతంగా అరకు పాడేరు నందు తరలించడం ఏజెంటుకు ఉన్న లక్షణం గాని గిరిజన మంత్రి లక్షణం కాదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు,

# సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలి







### -విభిన్న సాంకేతికతలు కలసి పనిచేయాలి

### ఏయూలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు క్వెస్ట్-ఏఐ

**విశాఖపట్నం ఏయూ క్యాంపస్ జయజయహే**


సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు సక్రమంగా వినియోగించడం ఎంతో ప్రధానమని ఐఐటి తిరుపతి డైరెక్టర్ ఆచార్య కె.ఎన్ సత్యనారాయణ అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు క్వాంటం ఎన్‌హేన్స్‌డ్ సస్టైనబుల్ టెక్నాలజీ ఫర్ ఏఐ సిస్టమ్స్ ( క్వెస్ట్-ఏఐ ) సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంకేతికతను సరైన రీతిలో ఉపయోగించుకోవడానికి అవగాహన అవసరమన్నారు. సాంకేతికత ఇంధన, ఆరోగ్య, వ్యవసాయ, తయారీ రంగాలను మార్చేస్తోందన్నారు. సమాజం మనం ఒక ప్రధానమైన మార్పు దిశగా వెళుతోందని, భూగోళానికి ముప్పు కలిగించకుండా ఈ సాంకేతికతలను మరింత శక్తివంతంగా మార్చాలని సూచించారు. నేడు విభిన్న శాస్త్రాల మధ్య సరిహద్దులు చెరిగిపోతున్నాయన్నారు. ఇంజనీరింగ్ విభాగాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తదుపరి సాంకేతిక విప్లవం ఒకే ఒక సాంకేతికతకు చెందింది కాదని, విభిన్న సాంకేతికతల సమిష్టి కలయికగా ఇది నిలుస్తుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్ అనేది క్లాసికల్ కంప్యూటర్లకు పూర్తి ప్రత్యామ్నాయం కాదని, భవిష్యత్తులో ఇవి రెండూ కలిసి పనిచేసే 'హైబ్రిడ్' నమూనానే ఎక్కువగా ఉ ంటుందన్నారు. భారత ప్రభుత్వం రూ. 6000 కోట్ల బడ్జెట్‌తో 'నేషనల్ క్వాంటం మిషన్' ను ప్రారంభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 'క్వాంటం వ్యాలీ' మాత్రమే కాకుండా సమగ్రమైన 'క్వాంటం ఏఐ ఎకోసిస్టమ్'ను నిర్మించే అరుదైన అవకాశం ఉంది. ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు మరియు ఐటి సంస్థల కృషితో ప్రాజెక్టు అమలుకు చర్యలు జరుగుతున్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ యూనివర్సిటీ (ఆస్ట్రేలియా) ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లెక్చరర్ నబిల్ మహమ్మద్, ఏయూ విసి ఆచార్య జి.ఎస్.రాజశేఖర్ , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వెంకట సుబ్బయ్య , ఏయూ పాలక మండలి సభ్యులు, సదస్సు చైర్, సి.ఎస్.ఇ విభాగాధిపతి, డీన్(ఆర్‌డిడి) ఆచార్య వి. వల్లి, సదస్సు అవుట్‌రీచ్ విభాగం డీన్ ఆచార్య కె.రమా సుధ, విభాగాధిపతులు ఆచార్య టి.ఆర్ జ్యోత్స్న, డి.లలిత భాస్కరి, పి.వి శ్రీదేవి, పి.స్వప్న, కె.వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

## ధార్మిక చైతన్య దీపనంతో సమాజంలో ధర్మజ్యోతి వెలగాలి

### పూజ్య ధర్మాచార్యుల పిలుపు

### ఘనంగా హిందూ ధార్మిక సమ్మేళనం

### అత్యంత భక్తిశ్రద్ధలతో చండీ హోమం



ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం, సనాతన ధర్మ విలువలను ప్రజల్లో పెంపొందించాలనే సంకల్పంతో డోన్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు "ధార్మిక చైతన్య దీపనం" పేరుతో హిందూ ధార్మిక సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా వారణాశి పట్టణానికి చెందిన సుప్రసిద్ధ పండితులు, యాజ్ఞికులు డాక్టర్ సోమయాజులు నేతృత్వంలో శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధి నందు నూతనంగా నిర్మించిన యాగశాల ప్రారంభోత్సవం, మహా చండీయాగం నిర్వహించారు. రఘునాథ శాస్త్రి ఆలయ అర్చకులు శ్రీమాన్ పెరంబోదూర్ శ్రీకాంత్ స్వామి అత్యంత వైభవంగా యాగశాల చతుర్ ద్వార పూజ మరియు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం ధార్మిక చైతన్య దీపనం పేరుతో ధార్మిక సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అఖిలాంధ్ర సాధుపరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ ఆచార్య పరమాత్మ నందగిరి స్వామీజీ ఆశీః ప్రసంగంతో ప్రారంభమైనది. తోట్లపల్లి అచలానంద ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విరజానందస్వామీజీ కీలకోపన్యాసం చేశారు. హైందవ సంస్కృతి నవ్య జీవనక్రాంతి అని, హైందవ సంస్కృతిని సంరక్షించుకున్నప్పుడే దేశమనుగడ సాధ్యమవుతుందని, సంస్కృతిని మరిచిపోతే దేశ సంరక్షణ ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు. వారణాసి వాస్తవ్యులు డాక్టర్ సోమయాజులు . రాష్ట్ర యువ విభాగ సాధుసంతు అధ్యక్షులు శ్రీమాన్ నిత్యతృప్త దాస్ స్వామీజీ . ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీ రఘునందన్ సేవక్ దాస్ జీ విశ్వహిందూ పరిషత్తు రాష్ట్ర కార్యాధ్యక్షులు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి ప్రసంగించారు ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీ బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజుగుప్తా, శ్రీ బాల ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మేపల్లి శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీ ముక్కా అశ్వినీకీర్తి స్త్రీశక్తి జాగరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డోన్ నగరంలోని అన్ని ధార్మిక సంస్థలతోపాటు, నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ధార్మిక సంస్థల ప్రతినిధులు విశేష సంఖ్యలో హాజరై, పూర్ణాహుతిని కళ్లారా దర్శించుకొని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అతిధులకు సాధుసంతులందరినీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పాతాళం సుబ్బారావు రజినీ, శ్రీనివాసులు దంపతులు, అందరినీ ఘనంగా సన్మానించి సత్కరించారు. పాతాళం సుబ్బారావు చేస్తున్న ధార్మిక సేవలను వక్తలు వేనోళ్ల కొనియాడారు. ఈ ధార్మిక సమ్మేళన కార్యక్రమానికి సమన్వయకర్తగా ప్రముఖ ధార్మిక ప్రవచకులు, కవయిత్రి, తెలుగు పండితులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని వ్యవహరించారు.






## మునగపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వైసీపీ ఆధ్వర్యంలో రైతుల ధర్నా

### తహసిల్దార్ కి వినతిపత్రం

**మునగపాక, సెప్టెంబర్ 2, జయ జయహే:**

మునగపాక వర్షాబావ పరిస్థితి వల్ల రైతులు నష్టపోతున్నారని తక్షణమే మునగపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎంపీపీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, మొల్లేటి శంకర్, మద్దాల వీరి నాయుడు, సుందరపు తాతాజీ, ఆడారి కాశి బాబు, కాండ్రేగుల నూకరాజు, కాండ్రేగుల జగన్, సూరిశెట్టి రాము, మండలంలో పలు రైతులు పాల్గొని తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.

## అగ్నిప్రమాదంపై విచారణ జరపండి

**మాడుగుల, సెప్టెంబరు 2 జయ జయహే**



మాడుగుల శ్రీ మోదమాంబ కాలనీ ఎంట్రెన్స్ హాస్టల్ పక్కన ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి ఒక వృద్ధురాలికు చెందిన ఇంటిని దగ్ధం చేసిన సంఘటనపై పోలీసులు విచారణ జరపాలని మాడుగుల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ కోరుతున్నారు. రాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో అపర్ణ అనే మహిళకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతి అయింది. అయితే అదృష్టవసరత్తు ఆ టైంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయినప్పటికీ ఇంట్లో సామాగ్రి బట్టలు బీరువా వంటివి కాలి బూడిద అయ్యాయి. పెన్షన్ డబ్బులు కూడా కాలిపోయనీ అయితే ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విచారణ చేపట్టాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి వృద్ధురాలను పరామర్శించి ఓదార్చారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు కే త్రినాధరావు, వడ్డాది బాబు పాల్గొన్నారు.



### భవిష్యత్తులో ఉత్తరాంధ్రకు

## 8 లక్షల ఎకరాలకు అందునున్న సాగునీరు

**అనకాపల్లి జయ జయహే**

భవిష్యత్తులో ఉత్తరాంధ్రలో సుమారు 8 లక్షల ఎకరాలకు గోదావరి నీటి తరలింపు ద్వారా సాగునీరు అందనన్నది అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు రెగ్యులేటర్ ఆన్ చేసి గోదావరి జలాలకు అఖండ జల హారతి సీఎం చంద్రబాబు ఇవ్వడం జరిగింది మొత్తంగా 2,87320 లక్షల ఎకరాలకు సాగునీరు 5.23 లక్షల మంది తాగునీరు లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణానికి ఇప్పటివరకు మొత్తంగా నాలుగు లక్షల నూట తొంబై రెండు కోట్ల ఖర్చుఅయింది ఏలేరు, పంప, తాండవ, వరాహ, శారద నదులు దాటుకుంటూ ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు తూర్పు కనుమలను తొలిచి కష్టమైన భౌగోళిక ప్రాంతాలను అధిగమిస్తూ కెనాన నిర్మాణ పనులు చేయడం జరిగింది కాలువ నిర్మాణంలో భాగంగా వివిధ నది ప్రవాహాల వద్ద సైఫన్లు ఆక్విడెక్కులు నిర్మాణం మరికొన్ని చోట్ల నదీప్రాహానిక ఎగువన ఇంకొన్ని చోట్ల దిగువ నుంచి కెనాలు నిర్మాణం ఏలూరు నది బెడ్ లెవెల్ కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణం పంపానది ఎగువు నుంచి అక్విడెక్ట్ నిర్మించి పోలవరం కాలువ ద్వారా మార్గం సుగమం చేయడం జరిగింది . ఎడమ ప్రధాన కాలువను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తో అనుసంధానం చేస్తూ వేగంగా జరుగుతున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం పనులు సమగ్ర ప్రణాళిక ద్వారా అనకాపల్లి విశాఖ విజయనగరం జిల్లాలకు గోదావరి జలాలు తరలింపును పార్వతీపురం మన్యం శ్రీకాకుళం జిల్లాల ఎగువ ప్రాంతాలకు గోదావరి నీటి తరలింపు భవిష్యత్తులో ఉ త్తరాంధ్ర సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందనున్నది చంద్రబాబు నాయుడు చేసిన ఈ జల యజ్ఞం రైతుల్లో ప్రజల్లో ఆనందాన్ని నింపింది




## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా బైక్ ర్యాలీ

**జయ జయహే నక్కపల్లి**

పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు డిఎల్ పురం గ్రామం నుంచి మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ఆధ్వర్యంలో 20 బైకులతో ప్రారంభమైన బైక్ ర్యాలీ అడ్డోడ్‌కు చేరుకుంది. జనసేన కార్యకర్తలతో కలిసి నామవరం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం నావారం నుంచి సీఎం పర్యటనలో భాగంగా పోలవరం కాలువ, తుని ఎడమ కాలువ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జనసేన కార్యకర్తలు హాజరయ్యారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు



## డుంబ్రిగూడలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**డుంబ్రిగూడ: జయ జయహే.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను డుంబ్రిగూడ మండలం మెయిన్ రోడ్ సెంటర్ నందు బుధవారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు సిదేరి దానేశ్వర రావు, మండల ఐటీ ఇన్చార్జ్ గుజ్జెలి రమేష్ ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి బంగారు రామదాసు ,ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అరకు నియోజకవర్గంతో పాటు ఏజెన్సీ పరిధిలోని వివిధ గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, ఆదివాసీలకు అవసరమైన కనీస మౌలిక వసతులైన రోడ్డు రవాణా, రక్షిత మంచినీటి సౌకర్యాల కల్పనకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని స్పష్టం చేశారు. కోట్లాది రూపాయల సంపాదననిచ్చే సినీ ఇండస్ట్రీని సైతం వదిలేసి, పేద ప్రజల, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, వారి భవిష్యత్తు కోసం ఎంతో ముందుచూపుతో రాజకీయాల్లోకి వచ్చిన ప్రజా నాయకుడు మన పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో జనసేన పార్టీ ముఖ్య నాయకులు, వీరమహిళలు, శ్రేణులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంట్రాక్టు మెడికల్, పారామెడికల్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

### జాయింట్ యాక్షన్ కమిటీ

### జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

**శ్రీకాకుళం (జయ జయహే )**



కాంట్రాక్టు మెడికల్, పారామెడికల్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, శ్రీకాకుళం మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ శ్రీకాకుళం బృందం, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు, జిల్లా వైద్యశాఖాధికారి ఈ.ఎన్వి.నరేష్ కుమార్ కు వినతిపత్రం అందజేసారు. ఇందులోభాగముగా శ్రీకాకుళం జెఎసి బృందం బుధవారం మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని వైద్య విద్యాశాఖ, ప్రజారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ సెకండరీ హెల్త్ విభాగ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు మెడికల్, పారామెడికల్ ఉ ద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన డిమాండ్లు ఇప్పటివరకు పరిష్కారం కాకపోవడంతో, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ శాంతియుత కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించడమైనదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద శాంతియుత ధర్నాలు చేపడతామని, జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని, దశలవారీ శాంతియుత కార్యాచరణ అనంతరం కూడా ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై తగిన స్పందన లభించని పక్షంలో, విధుల బహిష్కరణను ప్రకటిస్తామన్నారు. జేఏసీ తుది నిర్ణయం, నిబంధనల ప్రకారం ముందస్తు సమాచారం ఇచ్చి విధుల బహిష్కరణపై నిర్ణయం ప్రకటిస్తామని, ప్రధాన డిమాండ్లులలో, వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, 100% స్థూల వేతనం రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కాంట్రాక్టు ఉద్యోగులందరికీ 100% స్థూల వేతనం చెల్లించాలని, రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా, విధి నిర్వహణలో మరణించిన కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా అందించి, అర్హులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కల్పించాలన్నారు. ఎంప్లాయ్ ప్రావిడెన్డ్ ఫండ్, పూర్తి జీతంతో వైద్య సెలవులు, ఆరోగ్య బీమా కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఎంప్లాయ్ ప్రావిడెన్డ్ ఫండ్ అమలు చేయాలని, అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు పూర్తి జీతంతో కూడిన వైద్య సెలవులు మంజూరు చేసి, ఉద్యోగి, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం మా న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, జేఏసీ ప్రతినిధులతో తక్షణ చర్చలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని, జిల్లా కలెక్టర్ తోపాటుగా, జిల్లా వైద్యశాఖాధికారికి విజ్ఞప్తి చేశారు.

# అనకాపల్లిలో ఘనంగా జరిగిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





**అనకాపల్లి జయ జయహే**

జనసేన పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అనకాపల్లిలో ఘనంగా నిర్వహించారు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ వారి ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్ లో గల జనసేన పార్టీ కార్యాలయం నుంచి రావుగోపాల్ కళాక్షేత్రం వరకు పట్టణ మెయిన్ రోడ్డు గుండా బైక్ ర్యాలీ నిర్వహించుకుంటూ జై జనసేన జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు ఇచ్చుకుంటూ రావు గోపాల్ రావు కళాక్షేత్రానికి ఈ బైక్ ర్యాలీ చేరుకోవడం జరిగింది ఈ ర్యాలీలో జనసేన నాయకులు పార్టీ కార్యకర్తలు యువత వీర మహిళలు పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది అనంతరం రావుగోపాల్ రావు కళాక్షేత్రంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాసేవ స్ఫూర్తిని రాష్ట్ర ప్రయోజనాలు పట్ల ఉన్న నెబ్డతను ఆయన కొనియాడారు కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విశాఖ రైల్వే జోన్ పోలవరం ఎడమ కాలువ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉత్తరాంధ్ర అభివృద్ధి వంటి కీలక అంశాలలో పవన్ కళ్యాణ్ చొరవ ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు పిఠాపురంలో నిర్వహించిన జనసేన యు-ువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమం వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన వీక్షించారు ఈ సందర్భంగా జనసేన శ్రేణులు ఉత్సాహంగా పవన్ కళ్యాణ్ కార్యక్రమం చూసి కేరింతలతో జై కొట్టి నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు అలాగే అనకాపల్లి నియోజకవర్గంలో అత్యధిక జనసేన సభ్యత్వాలను నమోదు చేసి పార్టీ కృషి చేసిన నాయకులు కార్యకర్తలను కొనతాల రామకృష్ణ ఘనంగా సత్కరించి వారిని అభినందించారు నియోజకవర్గం ప్రతి గ్రామం నుంచి భారీగా తరలి వచ్చిన జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు యువత అభిమానులతో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి ఈ సందర్భంగా జన్మదిన కేకును కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అభిమానులు తెలపడం జరిగింది



## నోకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రంగారావు

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గవరపాలెంలో వెలసి ఉన్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ నోకాంబిక అమ్మవారిని దర్శించుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు (బేబీ నాయన) వీరికి ఆలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా స్వాగతం పలకడం జరిగింది ఎమ్మెల్యే రంగారావు అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించడం జరిగింది ఎమ్మెల్యే రంగారావుకు ఆలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించి వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి యాళ్ళ శ్రీధర్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు

**అనకాపల్లి జయ జయహే**



పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు గోదావరి జలాలు ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలాలను తీసుకొచ్చే మహాతర కార్యక్రమానికి పాయకరావుపేట వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ పాల్గొనడం జరిగింది పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లా వరకు చేరుకున్న గోదావరి జలాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి జల హారతి ఇవ్వడం జరిగింది ఉత్తరాంధ్ర అభివృద్ధికి వ్యవసాయానికి తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను అందించాలని లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నాన్ని సహకారం చేసే దిశగా కీలక మేలురాయి నిలిచింది ఈ చారిత్రక ఘట్టంలో అనకాపల్లి జిల్లా నుంచి అనకాపల్లి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జిల్లా ప్రజల తరఫున చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలుపుకోవడం జరిగింది



## క్రీడాకారులకు కాంగ్రెస్ భరోసా

**రాజమహేంద్రవరం: జయ జయహే : సెప్టెంబర్ 2 :**

రాష్ట్రంలోక్రీడారంగానికి కూటమి ప్రభుత్వం అన్యాయంచేస్తోందని, క్రీడాకారులసమస్యలపై కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఎపిసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకరరావు అన్నారు.స్థానిక కృష్ణసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి ఆదేశాల మేరకురాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో పర్యటిస్తూ క్రీడాకారులసమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు.నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, దేశాభివృద్ధికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమనిపేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులకు సరైన సదుపాయాలు కల్పించడం లేదని, వారికి ఎలాంటి సమస్య వచ్చినా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ మున్సిపల్ కాలనీలో క్రీడా మైదానాన్ని పరిరక్షిస్తున్నారని అభినందించారు. అనంతరం రాజు అనే యువకుడు కాంగ్రెస్ పార్టీలో చేరారు.అంతకుముందు ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. తప్పుడు కేసులు ఉపసంహరించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.ఎపిసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివి ఎస్ కమలాకరరావురాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డికాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



### వైఎస్సార్ విగ్రహానికి

## కాటంరెడ్డి పవిత్ర రెడ్డి నివాళి

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్**

**రేణిగుంట, సెప్టెంబర్ 2, జయ జయహే**

రేణిగుంట, సెప్టెంబర్ 2: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా రేణిగుంట పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.వైఎస్సార్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని ఆమె అన్నారు. మహానేత ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిద్ధగుంట సుధాకర్ రెడ్డి, గంగారి రమేష్, హరిప్రసాద్ రెడ్డి, ప్రభాకర్, పురుషోత్తం రెడ్డి, నగేష్, ఇర్ఫాన్, మునిశేఖర్ రెడ్డి, గణేష్ రెడ్డి, అస్సన్ సాహెబ్, రసూల్, జాన్ బాబ్, నాగరాజు, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా “డివైన్ ఫ్లోరా” ప్రదర్శన

**చోడవరం,సెప్టెంబర్ 2,జయ జయ హే**

స్తానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం “డివైన్ ఫ్లోరా పేరుతో పవిత్ర వృక్షాలపై అవగాహన కల్పించే ప్రదర్శనను నిర్వహించారు.వివిధ పండుగలు, పురాణాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలలో ప్రాధాన్యత కలిగిన మొక్కలు, వృక్షాలను ప్రదర్శనలో విద్యార్థులు పరిచయం చేశారు. ఆయా మొక్కల ఔషధ, పర్యావరణ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతలను విద్యార్థులు తెలుగు పొడుపు కథల రూపంలో ఆసక్తికరంగా వివరించారు. ఈ వినూత్న ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, మన పరిసరాలలో సహజంగా లభించే మొక్కలు, వృక్షాల గురించి విద్యార్థులకు మరియు సమాజానికి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్. పద్మావతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హెచ్. ఎస్. అనురాధ , డాక్టర్ వి. రత్నభారతి , షర్మిళ కోఆర్డినేటర్ రాజేష్ , మల్లిబాబు , చి. లక్ష్మీ తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాలకు వారసుడు జగన్: భరత్ రామ్

**రాజమహేంద్రవరం: జయ జయహే :**



సెప్టెంబర్ 2:దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచాయని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిఅనిరాజమహేంద్రవరం మాజీ ఎంపి , వైఎస్సార్‌సిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు.వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో వివిఎల్‌పురం వైఎస్సార్‌సిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో వైఎస్సార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అదే సంక్షేమ పాలనను జగన్‌మోహన్ రెడ్డి కొనసాగించారని, పేదలకు ఇళ్ల నిర్మాణం సహా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ప్రజల సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సిపి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వైఎస్సార్ పాలన పేదలకు భరోసా కల్పించిందని, ఆయన బాటలోనే జగన్ ముందుకు సాగుతున్నారని అన్నారు.అనంతరం కొబ్బరికాయల మార్కెట్, మోరంపూడి జంక్షన్, కోటగుమ్మం ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు భరత్ రామ్ పూలమాలలు వేసినివాళు లర్పించారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బిసి జెఎసి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గానినాగేశ్వరరావు,ఎపి గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్,వైఎస్సార్‌సిపి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, వార్డు ఇన్‌చార్జీలు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు.



## వైఎస్సార్‌కు ఘన నివాళి

**రాజమహేంద్రవరం :జయ జయహే సెప్టెంబర్ 2:**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు గూడూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ, “డాక్టర్ వైఎస్సార్ పేదల సంక్షేమాన్ని పరమావధిగా భావించి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత. ఆయన ఆశయాలు, సంక్షేమ పాలన నేటి తరానికి స్ఫూర్తిదాయకం. వైఎస్సార్ చూపిన మార్గంలోనే పార్టీ ముందుకు సాగుతుంది” అని పేర్కొన్నారు.గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, “వైఎస్సార్ ప్రజల కోసం జీవించిన గొప్ప నాయకుడు. రైతు, పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ఆయన ధ్యేయం. ఆయన సేవలను ప్రజలు ఎన్నటికీ మరువలేరు” అని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# సేవతో సత్తా చాటిన చిరు సేవా సమితి

**26 ఏళ్లుగా నిరంతర రక్తదాన సేవలు... గెడ్డం శివ సేవా స్ఫూర్తికి మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసలు**

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 2:**





కడియం మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని గత 26 సంవత్సరాలుగా నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థల్లో “చిరు సేవా సమితి” ఒకటని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా బుర్రిలంక పిఎస్ఎం కళ్యాణ మండపంలో చిరు సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంతో పాటు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కేక్ కట్ చేసిఅభిమానులతో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలుగా నిర్వహించాలన్న పవన్ కళ్యాణ్ సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్న గెడ్డం శివ అభినందనీయుడని ప్రశంసించారు. నిరాటంకంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం చిన్న విషయం కాదని, చిరు సేవా సమితి సభ్యుల సేవాభావం యువతకు ఆదర్శమని అన్నారు. అలాగే యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు “జై కొట్టు” నినాదంతో జనసేన యువజన విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.చిరు సేవా సమితి వ్యవస్థాపకుడు గెడ్డం శివ మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి సేవా తత్వం, పవన్ కళ్యాణ్ సమాజ సేవా ఆలోచనలే తమకు స్ఫూర్తి అని అన్నారు. రక్తదానం ద్వారా ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతి యువకుడు జీవితంలో కనీసం ఒక్కసారైనా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సేవే తమ సంస్థ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామనితెలిపారు.అంతకుముందు వేమగిరి నుంచి కడియం, దోసాలమ్మ కాలనీ, కడియపులంక, బుర్రిలంక మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెగా రక్తదాన, వైద్య శిబిరాలను ప్రారంభించగా వందలాది మంది అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో రత్నం అయ్యప్ప, గట్టి నరసయ్య, మార్గాని సత్యనారాయణ, గోరంట్ల రవి, రామ్ కిరణ్, పాఠంశెట్టి రవి, పాఠంశెట్టి సుబ్బారావు, బొరుసు సుబ్బారాయుడు, మార్గాని ఏడుకొండలు, చిరంజీవి--పవన్ కళ్యాణ్ అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com